## మున్సిపల్ ఎన్నికల్లో సత్తా చాటుతాం: వివేక్

సిద్దిపేట, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో దుబ్బాకలో కాంగ్రెస్ జెండా ఎగురుతుందని మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. గతంకంటే దుబ్బాకలో కాంగ్రెస్ జోష్ కనిపిస్తోంది..ఆ ప్రాంతంలో మెజార్టీ సర్పంచులను కాంగ్రెస్ గెలుచుకుంది.. అదే జోష్ లో మున్సిపల్ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ విజయం సాధించి దుబ్బాకలో కాంగ్రెస్ జెండా ఎగుర వేయాలన్నారు మంత్రి వివేక్ వెంకటస్వామి. కాంగ్రెస్ ప్రభుత్వంలో దుబ్బాకలో అనేక అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. రూ. 15కోట్లతో దుబ్బాక నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు. మున్సిపాలిటీలకు రూ. 50లక్షల చొప్పు న నిధులు కేటాయించామన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారన్నారు మంత్రి వివేక్. పేదలకు ఇందిరమ్మ ఇండ్లు కట్టిస్తున్నాం.. అర్హత కలిగి ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు మంజూరు చేశామన్నారు. రైతులకు 2లక్షల రుణమాఫీ పూర్తి చేశామన్నారు.రుణమాఫీ కాని వారు ఎవరైనా ఉంటే వారి పేర్లు ఇస్తే రుణమాఫీ చేయిస్తానని హామి ఇచ్చారు.



# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :276 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: గురువారం 15-01-2026 | పేజీలు:4 వెల: 2.00


## మేడారంలో కొనసాగుతున్న ముందస్తు మొక్కులు..



తాడ్వాయి(ములుగు): మేడారంలో వనదే వతలు సమ్మక్క–సారలమ్మలను భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకుంటున్నారు. మంగళవారం వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు వనదేవతలను దర్శించుకున్నారు. తల్లుల గద్దెలకు పూజలు చేసి కోరికలు తీరాలని వేడుకున్నారు. ప్రకృతి దేవతలుగా కొలువైన అమ్మ వార్లను దర్శించుకుని పూలు, పండ్లు, పసుపు, కుంకుమ, చీరె సారె, ఎత్తు బంగారం(బెల్లం), కొబ్బరికాయలు, యాట మొక్కులు సమర్పి ంచుకున్నారు. 30వేల మందికి పైగా భక్తులు అమ్మవార్లను దర్శించుకు న్నారని దేవస్థానం అధికా రులు తెలిపారు. భక్తుల రాకతో గద్దెల పరిసరాలు, దేవస్థా నం ప్రాంగణం రద్దీగా మారాయి.ఆదివాసీ సంస్కృతీ సంప్రదా యాలతో డోలు వాయిద్యాలు, శివసత్తుల పూనకాలు, సమ్మక్క– సారలమ్మల నామస్మరణల తో మేడారం పరిసరాలు, దేవస్థానం మార్మోగింది. వనదేవ తలను దర్శించుకున్న భక్తులు పరిసరాల్లో విడిది చేసి బంధుమిత్రులతో విందు భోజనాలు చేశారు.

రోడ్లపై దుబ్బ తొలగింపు..

తాడ్వాయి: మహాజాతర సందర్భం గా జరుగుతున్న అభివృద్ధి పనులతో రోడ్డు మట్టి, దుబ్బతో నిండిపోయాయి. దీంతో పారిశుధ్య కార్మికుల ద్వారా అధికారులు రోడ్లపై ఉన్న దుబ్బను తొలగించారు. అంతేకాకుండా రోడ్లు శుభ్రం చేసే ప్రత్యేక యంత్రాలతో రాత్రి సమయాల్లో పారిశుధ్య పనులు చేపడుతున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్ఠ చర్యలు చేపడుతున్నామని డీపీవో వెంకయ్య తెలిపారు. అదనపు కార్మికులతో ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగి స్తున్నామని అన్నారు.

దేవస్థానంలో పూజిత వృక్షలు

తాడ్వాయి: మేడారం దేవస్థానంలో వ నదేవతల దేవతా వృక్షలు, పూజి త వృక్షలను భక్తులకు తెలిసేలా అధికారులు నాటుతున్నారు. ఈ క్రమంలో మంగళ వారం సమ్మ క్క– సారలమ్మల గద్దెల దేవస్థా నం పరిసరాల్లో అధికారులు వృ క్షలను నాటారు. దేవస్థానం ఆ ధునికీకరణ పనుల్లో భాగంగా చే పట్టిన అభివృద్ధి పనుల్లో ఈ వృక్ష లను అటవీ శాఖ అధికారుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నారు.

మొబైల్ మరుగుదొడ్లు..

తాడ్వాయి: మేడారానికి ముందస్తుగా తరలివస్తున్న మహిళా భక్తుల కోసం అధికారు లు మొబైల్ మరుగుదొడ్లను ఏర్పాటు చేశారు. భక్తులు రద్దీగా ఉండే ప్రాంతాలైన ఆర్టీసీ బస్టాండ్, దేవస్థానం పరిసరాలు, జంపన్నవాగు, చిలకలగుట్ట, దేవస్థానం సమీపంలోని పార్కింగ్ వద్ద వీటిని అందుబాటులోకి తెచ్చారు. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పలు సౌకర్యాల నిర్మాణాలు ప్రారంభం కాకపోవడంతో ఈ మొబైల్ మరుగుదొడ్లను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.

చిలకల గుట్టకు దారి..

తాడ్వాయి: మహాజాతర సందర్భం గా సమ్మక్క గద్దెకు వచ్చే చిలకలగద్దె దారిని అధికారులు కార్మికులతో మంగళవారం శుభ్రం చేశారు. ఈ నెల 29న సమ్మక్క దేవత ప్రభుత్వ లాంఛనాలతో గద్దెకు చేరుకోవడం తెలిసిందే. అయితే రెండు సంవత్సరాలుగా గేటు మూసి ఉండటంతో గుట్టకు వెళ్లేదారిలో పిచ్చి మొక్కలు పెరిగి ఉన్నాయి. మహాజాతర ఏర్పాట్లలో భాగంగా అధికారులు సిబ్బందితో శుభ్రం చేయిస్తున్నారు.

## హరీష్ రావుకి షాక్.. సిద్ధిపేట ఎమ్మెల్యేగా కవిత.?

హైదరాబాద్,ఎమ్మెల్సీ కవితకు సంబంధించిన ఏదో ఒక న్యూస్ సోషల్ మీడియా లో, మెయిన్ మీడియాలో ఏదో రకంగా వినిపిస్తోంది. ఈ విధంగా జనాల్లో హైలెట్ అవుతున్నటువంటి కవిత ప్రతిరోజు కొత్త కొత్త విషయాల గురించి మాట్లాడుతూ రాజకీయాన్ని మరింత రసవత్తరంగా మారుస్తోంది.అలాంటి కవిత దేవనపల్లి గురించి తాజాగా ఒక విషయం సోషల్ మీడియాలో హైలెట్ అవుతోంది. ఇంతకీ అది ఏంటయ్యా అంటే.. ఆమె సిద్దిపేట నియోజకవర్గం నుంచి ఎంఎల్ఏ గా పోటీ చేయడం.. ఇప్పటివరకు సిద్దిపేట ని ఏలింది కేసీఆర్ తర్వాత హరీష్ రావు మాత్రమే.. కేసీఆర్ తప్పుకొని అల్లుడు హరీష్ రావుకు ఆ నియోజకవర్గాన్ని అప్పజెప్పిన తర్వాత అక్కడ ఆయన వరుస విజయాలు సాధిస్తూ అద్భుతమైనటువంటి అభివృద్ధిని చేస్తూ వచ్చారు..అలాంటి నియోజకవర్గంలో కవిత వచ్చే ఎన్నికల్లో పోటీ చేయాలని ఆలోచన చేస్తున్నారని తెలుస్తోంది. తన బావ హరీష్ రావును ఓడిస్తేనే ఆమెకు తెలంగాణలో వ్యాల్యూ ఉంటుందని, అందుకే ఆమె సిద్దిపేటలో పోటీ చేయాలనే ఆలోచన చేస్తున్నట్టు సమాచారం.. అయితే హరీష్ రావుకు సిద్దిపేట అనేది ఒక కంచుకోట.కేసీఆర్ కూడా అక్కడ వరుసగా కొన్నిసార్లు విజయం సాధించారు.. కానీ చివరికి అల్లుడి కోసం ఆ నియోజకవర్గాన్ని వదిలి ఆయన మరో ప్లేస్ కు వెళ్లిపోయారు.. దీంతో తన తండ్రి వదిలిన నియోజకవర్గాన్ని తాను మళ్ళీ చేతుల్లోకి తీసుకోవాలని హరీష్ రావును అక్కడ ఓడించాలనే ప్రయత్నాలు చేస్తున్నారని తెలుస్తోంది.అయితే ఈ



వార్త సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో ఒక్కొక్కరు ఒక్కో విధంగా స్పందిస్తు న్నారు.. కవితకు అంత సీన్ లేదు 20 సంవత్సరాలుగా సిద్దిపేట ను ఎంతో డెవలప్ చేశారు హరీష్ రావు.. అక్కడి వాళ్లు ఆయనను ఒక దేవుడిలా కొలుస్తారు. అంతటి ఘనత కలిగిన లీడర్ ను ఓడించడం కవిత వల్ల కాదంటూ కొంతమంది మాట్లాడుతున్నారు.. మరి కొంతమందేమో కవిత ఆ నియోజకవర్గంలో పోటీ చేస్తేనే బాగుంటుంది అంటూ మాట్లాడుకుంటున్నారు.. కవిత రాబోవు ఎలక్షన్స్ వరకు ఏ విధమైనటువంటి నిర్ణయం తీసుకుంటుంది..సిద్దిపేట లో నిజంగానే పోటీ చేస్తుందా అనేది ముందు ముందు తెలుస్తుంది

## ఇరాన్‌లో ఆందోళనలు.. 2571కి పెరిగిన మృతుల సంఖ్య



టెహ్రాన్: ఇరాన్‌లో ఖమేనీ సర్కార్‌కు వ్యతిరేకంగా నిరసనలు మరింత తీవ్రమయ్యా యి. నిరసనకారులపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతున్నది. ఈ ఆందోళనల్లో ఇప్పటివరకు 2571 మంది మృతిచెందినట్లుగా అమెరికా కేంద్రంగా పనిచేసే మానవ హక్కుల ఉద్యమకారుల వార్తా సంస్థ బుధవారం వెల్లడించింది. వీరిలో 2,403 మంది ఆందోళన కారులు కాగా, 147 మంది భద్రా సిబ్బంది, ప్రభుత్వా నికి చెందిన వారు ఉన్నారని తెలుస్తోంది. ఆందోళనలతో సంబంధం లేని 12 మంది చిన్నారులు, 9 మంది సాధారణ పౌరులు కూడా చనిపోయారని పేర్కొం ది.కాగా, ఆందోళనల్లో 2 వేల మంది మరణించినట్లు స్వయంగా ప్రభుత్వ మే అంగీకరించింది. అయితే ప్రభుత్వం ప్రకటించిన ఈ సంఖ్యను విపక్షల అనుకూల వెబ్‌సైట్ ఇరాన్ ఇంటర్నేషనల్ తీవ్రంగా ఖండించింది. ఇరాన్ భద్రతా దళాల చేతుల్లో 12 వేల మందికి పైగానే ఇరాన్ పౌరులు మరణించారని వెల్లడించింది. ఇది ఇరాన్ ఆధునిక చరిత్రలో అతి పెద్ద మారణ హెూమంగా అభివర్ణించింది. ఇరాన్ ప్రభుత్వం సొంత భద్రతా సంస్థలు, ఇతర సంస్థల నుంచి అందిన సమాచారం మేరకు ఈ మృతుల సంఖ్యను పేర్కొన్నట్టు ఈ వెబ్‌సైట్ వెల్లడించింది. కాగా, ప్రస్తుతం దేశంలో ఇంటర్నెట్‌పై నిషేధం అమలువు తున్నందున పూర్తి సమాచారం అందడం లేదని, అందుకే మృతుల సంఖ్య స్పష్టంగా తెలియడం లేదని పలు మీడియా సంస్థలు పేర్కొన్నాయి. పౌరులు, భద్రతా సిబ్బంది మరణాల వెనుక ఉగ్రవాదుల హస్తం ఉందని ఒక ఇరాన్ అధికారి తెలిపారు. అయితే ఏ ఉగ్రవాదులు వారిని చంపారో ఆయన వివరించలేదు.

## చైనా మంజా అంశంపై తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ సీరియస్

హైదరాబాద్, ప్రజల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టుతున్న చైనా మంజా విక్రయాలు, వినియోగంపై తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ అంశంపై దాఖలైన పిటిషన్‌ను విచారించిన కమిషన్ ఫిబ్రవరి 26లోగా పూర్తి నివేదిక సమర్పించాలని హైదరాబాద్ సీపీ సజ్జనార్‌ను ఆదేశించింది.తెలంగాణలో ఇప్పటికే నిషేధం అమల్లో ఉన్నప్పటికీ, చైనా మంజా వినియోగం వల్ల జరుగుతున్న గాయాలు, మరణాలపై హ్యూమన్ రైట్స్ అడ్వకేట్ ఇమ్మానేని రామారావు రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌లో పిటిషన్ దాఖలు చేశారు. 2025 డిసెంబర్ 30న దాఖలైన ఈ పిటిషన్‌లో చైనా మంజాను పూర్తిగా నిషేధించడంతో పాటు, విక్రయాలు మరియు వినియోగంపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.పిటిషన్‌లో పేర్కొన్న వివరాల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా చైనా మంజా కారణంగా అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. కీసరలో జశ్వంత్ రెడ్డి అనే బాలుడు తీవ్ర గాయాలపాలయ్యాడు. అలాగే షమ్షేర్‌గంజ్‌లో జమీల్ అనే వ్యక్తికి మెడ చుట్టూ లోతైన కోతపడి సుమారు 22 కుట్లు పడిన ఘటన చోటుచేసుకుంది. చైనా మంజా గాజు లేదా మెటల్ కోటింగ్‌తో తయారవుతుండటంతో ఇది అత్యంత ప్రమాదకరమని పిటిషనర్



కమిషన్‌కు వివరించారు.చైనా మంజాను పూర్తిగా నిషేధించడమే కాకుండా, ఈ–కామర్స్ వెబ్‌సైట్లలో జరుగుతున్న అమ్మకాలపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని పిటిషనర్లు డిమాండ్ చేస్తున్నారు.ఇదిలా ఉండగా, ఇటీవల హైదరాబాద్ పోలీసులు చైనా మంజా విక్రయాలపై విస్తృతంగా దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా రూ. 1.24 కోట్ల విలువైన చైనా మంజా స్టాక్‌ను సీజ్ చేయడంతో పాటు, 143 మందిని అరెస్ట్ చేశారు.

## కవితను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకునే అవకాశం లేదు

హైదరాబాద్, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కాంగ్రెస్ పార్టీలో చేరబోతున్నారంటూ కొద్దిరోజులుగా వస్తున్న వార్తలపై పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తోసిపుచ్చుతూ.. అలాంటిదేమీ లేదని అన్నారు. మంగళవారం నాడు మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో పీసీసీ చీఫ్ మాట్లాడుతూ.. కవితను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకునే అవకాశమే లేదని స్పష్టం చేశారు. తెలంగాణాలో బీఆర్ఎస్ పార్టీకి గతం తప్ప.. భవిష్యత్తు లేదంటూ వ్యాఖ్యానించారు. కేసీఆర్ కుటుంబ అవినీతి గురించి కవిత నిజాలు చెప్తున్నారన్నారు. తాము చేసిన ఆరోపణలపై కవిత సమాధానం రూపంలో రుజువైందని చెప్పారు. కవిత మాటలతో కేసీఆర్ అవినీతి నిజమని ప్రజలు అర్థం చేసుకుంటున్నారని ఆయన చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డికి తెలంగాణా ప్రయోజనాలే ముఖ్యమని.. ఒక్క నీటిబొట్టును కూడా వదలమని తేల్చిచెప్పారు. అజారుద్దీన్, కోదండరామ్ ఎమ్మెల్సీల విషయంలో మంచి స్పందన వస్తోందని నమ్ముతున్నట్లు తెలిపారు. ఏప్రిల్‌లో కార్పొరేషన్ ఛైర్మన్లను భర్తీ చేస్తామని ప్రకటించారు. పదవులు తక్కువ అయ్యాయని... ఆశావహులు ఎక్కువ అయ్యారని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల కోసం పార్టీ తరఫున ఒక కమిటీ వేస్తామని.. సర్వేల ఆధారంగా టికెట్ల ఇస్తామని చెప్పారు. గెలిచే అభ్యర్థులకే టికెట్ ఇస్తామని మహేశ్ కుమార్ పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో పొత్తుపై పీఏసీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. బీజేపీని తెలంగాణాలో నమ్మే పరిస్థితి లేదన్నారు మహేశ్ కుమార్. మత రాజకీయాలు రాష్ట్రంలో నడవవని అన్నారు. రాముడికి, బీజేపీకి సంబంధమేంటి అని ఆయన ప్రశ్నించారు. తాము హిందూ ఆచారాలను పాటిస్తామని.. కానీ హిందూ సెంటిమెంట్‌తో ఓట్లు అడగమని తెలిపారు. తనకు, సీఎం రేవంత్ మధ్య మంచి సాన్నిహిత్యం ఉందన్నారు పీసీసీ చీఫ్. మంత్రులకు, సీఎంకు మధ్య ఎలాంటి గ్యాప్ లేదని మహేశ్ తేల్చిచెప్పారు.



ఇతర మంత్రుల శాఖల్లో ముఖ్యమంత్రి తలదూర్చరన్నారు. మంత్రులకు పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నారని వెల్లడించారు. డీ సెంట్రలైజేషన్ కోసమే మేడారంలో క్యాబినెట్ సమావేశం ఏర్పాటు చేస్తున్నారని పీసీసీ చీఫ్ తెలిపారు. కేసీఆర్.. కుమారుడికి ఒక జిల్లా, కూతురికి ఒక జిల్లా, అల్లుడికి ఒక జిల్లా ఇచ్చారని పీసీసీ చీఫ్ ఆరోపణలు గుప్పించారు. కేసీఆర్ అశాస్త్రీయంగా జిల్లాలను విభజించారని మండిపడ్డారు. శాస్త్రీయంగా జిల్లాల పునర్విభజన చేయాలని కమిటీ వేస్తున్నామని తెలిపారు. సికింద్రాబాద్‌ను ఎవరు ముట్టుకున్నారని తలసాని శ్రీనివాస్ యాదవ్ గాబరాపడుతున్నారని ప్రశ్నించారు. వ్యక్తిగత జీవితాలతో ఆడుకునే హక్కు ఎవరికీ లేదన్నారు. మహిళా అధికారులపై ఆధారాలు లేకుండా వార్తలు రాస్తే ఎంత ఇబ్బంది పడతారో అర్థం చేసుకోవాలన్నారు. సోషల్ మీడియాను కట్టడి చేయాలన్నారు. పదేళ్లలో వచ్చిన ఉద్యోగాలు ఎన్ని.. రెండేళ్లలో ఇచ్చిన ఉద్యోగాలు ఎన్నో నిరుద్యోగులు అర్థం చేసుకోవాలని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

## తెలుగు రాష్ట్రాల్లో చిచ్చుపెట్టేందుకు వైకాపా – భారాస కుట్ర



అమరావతి,రెండు తెలుగు రాష్ట్రాలు, తెలుగు ప్రజల మధ్య చిచ్చుపెట్టేందుకు ఏపీలోని వైకాపా, తెలంగాణ రాష్ట్రంలోని భారతీయ రాష్ట్ర సమితిలు కుట్రలు పన్నుతున్నాయని టీడీపీ నేత పట్టాభి ఆరోపించారు. ఈ అంశంపై ఆయన మీడియాతో మాట్లాడుతూ, రెండు తెలుగు రాష్ట్రాలూ.. రైతులూ బాగుండాలనేది ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచన అయితే, తెలుగు ప్రజలు నాశనం కావాలనే దురుద్దేశంతో వైకాపా, భారాసలు వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. 'రెండు తెలుగు రాష్ట్రాలూ తనకు రెండు కళ్లు అని చెప్పిన స్టేట్స్‌మన్ చంద్రబాబు. స్వార్థ రాజకీయాలే ప్రధానం అనే విధంగా వైకాపా, భారాస నేతల తీరు ఉంది. పోలవరం ఎత్తును ఒక మీటరు తగ్గించుకుంటే ఏమవుతుందని తెలంగాణ అప్పటి సీఎం కేసీఆర్ అసెంబ్లీలో మాట్లాడితే.. ఆ వ్యాఖ్యల్ని నాటి సీఎం జగన్ ఖండించాల్సింది పోయి... అసెంబ్లీలో పొగడ్తలతో ముంచెత్తారు. ఇప్పుడు అదే జగన్ రాయలసీమ ఎత్తిపోతల పేరుతో కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. స్వార్థ రాజకీయాల కోసం జగన్, భారాస నేతలు పనిచేస్తున్నారు' అని పట్టాభిరాం ధ్వజమెత్తారు.'రాయలసీమ ఎత్తిపోతల పథకం, ఇతర ప్రాజెక్టులపై నమస్తే తెలంగాణ, సాక్ష పత్రికలు తప్పుడు కథనాలు రాస్తున్నాయి. రెండు రాష్ట్రాల ప్రజల్ని రెచ్చగొట్టేలా వ్యవహరిస్తున్నాయి. తెలంగాణ నీటికి చంద్రబాబు అడ్డుపడుతున్నారంటూ నమస్తే తెలంగాణ తప్పుడు కథనం ప్రచురించింది. సీమకు బాబు ద్రోహం తలపెడుతూ తెలంగాణకు న్యాయం చేస్తున్నారంటూ సాక్షలో తప్పుడు కథనం వచ్చింది. ఆ రెండు పార్టీలు, రెండు పత్రికలు, రెండు కుటుంబాలు కలిసి తెలుగు ప్రజలను మోసగిస్తున్నాయి.రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని ఆపింది మేమే అంటూ భారాస నేత హరీశ్‌రావు మాట్లాడిన వార్తను నమస్తే తెలంగాణలో రాస్తారు. సీమ లిఫ్ట్‌ను నేనే ఆపించానంటూ సీఎం రేవంత్ మాట్లాడినట్లు సాక్షలో రాస్తారు. నీ రాష్ట్రంలో నీ డ్రామా నువ్వు ఆడు.. నా రాష్ట్రంలో నా డ్రామా నేను ఆడతా అంటూ జగన్, కేసీఆర్‌లు వ్యవహరిస్తున్నారు' అని పట్టాభిరాం దుయ్యబట్టారు.

## 'సీఎం' గందరగోళంపై స్పష్టతనివ్వండి: రాహుల్‌ను కోరిన సిద్ధరామయ్య..



బెంగళూర్ : కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మంగళవారం మైసూరులో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో సమావేశమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో సీఎం మార్పు అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. రాహుల్‌తో భేటీలో సీఎం మార్పు అంశంపై స్పష్టతనివ్వాలని సిద్ధరామయ్య ఆయనను కోరినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.అధికార మార్పు విషయంలో రాష్ట్ర ప్రజలు,పార్టీ,నేతలు కార్యకర్తలు గందరగోళానికి గురవుతున్నా రని.. దీనిపై వారికి స్పష్టతనివ్వాల్సిన అవసరం ఉందని పేర్కొన్నట్లు సమాచారం. గత నవంబరు 20తో సిద్ధరామయ్య సర్కారుకు రెండున్నరేళ్ల గడువు ముగిసిన నేపథ్యంలో సిద్ధు, డీకే మద్దతుదారులు అదే పనిగా దిల్లీలో కాంగ్రెస్ నేతలతో సమావేశమవుతున్నారు. సిద్ధరామయ్య, డీకే అల్పాహార భేటీల పేరుతో మద్దతుదారులతో సమావేశమవడం, తాను సీఎం కావాలనే కోరికను శివకుమార్ పలుమార్లు పరోక్షంగా వ్యక్తపరుస్తుండడం తో కర్ణాటకలో సీఎం మార్పు ఉ ంటుందనే వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ఈ సమయంలో రాహుల్ కర్ణాటకకు వెళ్లడం ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే రాహుల్‌గాంధీతో తాము మర్యాదపూర్వకంగానే భేటీ అయినట్లు సిద్ధరామయ్య పేర్కొన్నారు. మం త్రివర్గ విస్తరణపై త్వరలో రాహుల్‌తో మరోసారి సమావేశమవ్వనున్నట్లు తెలిపారు.

## కాంగ్రెస్ చెడు ఆలోచనలు భోగి మంటల్లో కాలిపోవాలి

సూర్యాపేట : రెండేళ్లుగా రాష్ట్రంలో ప్రజా వ్యతిరేకపాలన సాగుతోంది. కాంగ్రెస్ చెడు ఆలోచనలు భోగి మంటల్లో కాలి పోవాలి అని సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. భోగి పండుగ సందర్భంగా సూర్యాపేట పట్టణంలోని పలు వార్డుల్లో జరిగిన భోగి మంటల వేడుకలో పాల్గొని అందరికి పండుగ శుభాకాంక్షలు తెలిపి మీడియాతో మాట్లాడారు. సంక్రాంతి అంటే రైతుల పంటల పండుగ.పతంగులతో చిన్నారులు, ముగ్గులతో మహిళలు మురిసే పండుగ అన్నారు. భోగిమంటల్లో అందరి చెడు ఆలోచనలు తొలగిపోవాలని ఆకాంక్షంచారు. చిన్నారులు తగు జాగ్రత్తలు పాటిస్తూ పతంగులు ఎగుర వేయాలని సూచించారు. రాష్ట్ర అభివృద్ధి పట్ల, సంక్షమం పట్ల సోయిలేని కాంగ్రెస్, ఆపార్టీ పాలకుల తీరు ప్రజల ఆకాంక్షలకు విరుద్ధంగా ఉందన్నారు. రెండేళ్ల పాలనలో అరాచకాలు, అక్రమాలు తప్ప చేసిందేమీ లేదని విమర్శించారు. ఈ



ఏడాది నుంచైనా మంచి పరిపాలన కొనసాగాలని ఆకాంక్షద్దామన్నారు. ఆయన వెంట మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, తదితరులు ఉన్నారు.

## సంపాదకీయం

గురువారం 15-01-2026

# పింఛను పథకానికి కొత్త రూపు

ప్రభుత్వ ఉద్యోగులకు వర్తించే పాత పింఛన్ విధానానికి స్వస్తి పలికిన కేంద్రం- సర్కారీ ఉద్యోగుల కోసం 2004లో జాతీయ పెన్షన్ పథకం(ఎన్పీఎస్) తీసుకొచ్చింది. 2009లో దీన్ని పౌరులకు విస్తరించారు. అటు తరవాత 2011లో ప్రైవేట్ ఉద్యోగుల కోసం ప్రత్యేకంగా 'ఎన్పీఎస్ కార్పొరేట్ సెక్టార్ మోడల్'ను తీసుకొచ్చారు. అయితే పింఛను నిధి నియంత్రణ, అభివృద్ధి ప్రాధికార సంస్థ మొన్న అక్టోబరు నుంచి ప్రభుత్వేతర విభాగాల్లో అమలవుతున్న పింఛన్ పథకాల్లో పలు మార్పులు చేసింది. మల్టీ స్కీమ్ ఫ్రేమ్‌వర్క్ కింద మరికొన్ని సవరణలూ తీసుకొచ్చింది. ఇవన్నీ అమలైతే, నూతన పింఛన్ పథకం మ్యూచువల్ ఫండ్స్‌కు గట్టి పోటీ ఇచ్చే అవకాశముంది.దేశంలోని నేషనల్ పెన్షన్ స్కీమ్(ఎన్పీఎస్) చందాదారులకు గతంలో ఒకే ఒక్క పర్మినెంట్ రిటైర్‌మెంట్ అకౌంట్ నంబర్(ప్రాన్) ఉండేది. దాని ద్వారా ఎన్పీఎస్‌లోని మూడు సెంట్రల్ రికార్డ్-కీపింగ్ ఏజెన్సీల్లో ఏదో ఒకదానికి అనుసంధానమై, ఒక ఖాతాను మాత్రమే నిర్వహించుకోవాల్సి వచ్చేది. తాజా మార్పు వల్ల, ప్రభుత్వేతర చందాదారుడికి మల్టీ స్కీమ్ ఫ్రేమ్‌వర్క్ కింద భిన్న పథకాల్లో పెట్టుబడి పెట్టేందుకు అవకాశం లభిస్తుంది. కాబట్టి, కేవలం పదవీ విమరణ నిధిలోనే కాకుండా, సంపద పెంచే పథకాల్లోనూ చేరవచ్చు. అందుకోసమని, జీవితంలో వివిధ సందర్భాలకు అవసరమైన విభిన్న పథకాలను రూపొందించే అవకాశాన్ని పెన్షన్ ఫండ్ నిర్వహణ సంస్థలకు కల్పించారు. వీటి పేర్లలో తప్పనిసరిగా 'ఎన్పీఎస్' ఉండాలని నిర్దేశించారు. ఇప్పుడు తాజాగా ఎన్పీఎస్‌లోని పథకాలన్నింటినీ కామన్ స్కీమ్స్‌గా పేర్కొనాలని నిర్ణయించారు. ఇంకోవైపు, పెన్షన్ ఫండ్ నిర్వహణ సంస్థలు సమాజంలోని వివిధ వర్గాలవారికి తగినట్లుగా ప్రత్యేక పథకాలు రూపొందించుకోవడానికీ అనుమతించారు. కార్పొరేట్ ఉద్యోగులకు ఎంప్లాయర్, ఎంప్లాయి కంట్రిబ్యూషన్స్‌ను 'ఫ్లెక్సిబుల్ కాంబినేషన్స్'లో నిర్ధారించుకునే అవకాశం కూడా కల్పించారు. అయితే, ఈ కొత్త పథకాల్లోని చందాదారులు ఎప్పుడైనా సాధారణ పథకాల్లోకి మారిపోవచ్చు. కానీ, ఇదే రకమైన ఇతర సంస్థల పథకాల్లోకి మారాలంటే నిర్ణీత వ్యవధి పూర్తికావాల్సిందే. పింఛన్ ఫండ్ నిర్వాహకులు ప్రవేశపెట్టే ప్రతి పథకానికి సంబంధించి 'రిస్కో మీటర్'ను బహిర్గతం చేస్తారు. పథకం నిర్వహణలో ఒడుదొడుకులు ఎదురైనప్పుడు ఆరు నెలలపాటు పెట్టుబడులను పునఃవర్గీకరణ చేసుకునే వీలుంటుంది. కాబట్టి, అన్ని ఫలితాలనూ పారదర్శకంగా వెల్లడించాలని నిర్ణయించారు. ప్రతి పథకంలో హైరిస్క్, మిడిల్‌రిస్క్ ఐచ్ఛికాలు తప్పనిసరిగా ఉండాలి. కావాలనుకుంటే ఫండ్ నిర్వాహకులు లోరిస్క్ వేరియంట్‌నూ రూపొందించుకోవచ్చు.

### పదిహేనేళ్లకే ఉపసంహరణకు అవకాశం

మునుపు ఎన్పీఎస్ చందాదారులు ఒకే ఈక్విటీ ఫండ్, ఒకే గవర్నమెంట్ బాండ్, ఒకే కార్పొరేట్ బాండ్ లేదా మరో ప్రత్యామ్నాయ ఫండ్‌లో మాత్రమే పెట్టుబడి పెట్టేందుకు వీలుండేది. ప్రస్తుత మార్పుల వల్ల ఒక చందాదారుడు నాలుగు రకాల ఈక్విటీ పథకాల్లో మదుపుచేసే అవకాశం కల్పించారు. వివిధ వర్గాల కోసం ప్రత్యేక పథకాలను రూపొందించుకునే అవకాశాన్ని అందిపుచ్చుకున్న హెచ్‌డీఎఫ్‌సీ పెన్షన్ ఫండ్- 'జొమాటో' డెలివరీ సిబ్బంది కోసం ప్రత్యేక పథకాన్ని తీసుకొస్తున్నట్లు ఇటీవల ప్రకటించింది. ఇలాంటి కొత్త పథకాల్లో గ్రోత్ ప్లాన్, వెల్త్ బిల్డర్, పెన్షన్ పేఅవుట్, సెక్యూర్ రిటైర్‌మెంట్ పథకాలను రూపొందించుకోవచ్చు.ఎన్పీఎస్‌కు ఇటీవల మరిన్ని సవరణలు తీసుకొచ్చారు. ప్రభుత్వేతర చందాదారులు దీన్నించి బయటికి వచ్చే(ఎగ్జిట్) సమయంలో నిధుల గరిష్ఠ ఉపసంహరణ పరిమితిని 80శాతానికి పెంచారు. ఇంతకుముందు ఇది 60శాతమే. యాన్యుటీ పథకాలకు వెచ్చించాల్సిన నలభైశాతం నిధులను ఇరవైశాతానికి తగ్గించారు. మరో ముఖ్యమైన మార్పు- అరవైఏళ్ల వరకూ వేచి చూడకుండా, 15 ఏళ్ల తరవాత ఎప్పుడైనా ఫండ్‌ను ఉపసంహరించుకోవడం. ఇంకోవైపు, ఎగ్జిట్ వయసును 85 ఏళ్లకు పెంచారు. దీనివల్ల ఆదాయ పన్ను మినహాయింపును దీర్ఘకాలంపాటు పొందవచ్చు. దురదృష్టవశాత్తు ఈలోగా చందాదారుడు మరణించినా, పథకంలోని నిధులను వారసులు పూర్తి ఆదాయపన్ను మినహాయింపుతో పొందుతారు. మ్యూచువల్ ఫండ్స్‌లో అలా ఉండదు. అక్కడ వచ్చిన లాభాలపై చందాదారుడు లేదా వారసులు పన్ను చెల్లించాల్సి ఉంటుంది. లాక్-ఇన్ పీరియడ్ 15 ఏళ్లుగా ఉన్నందున- చందాదారుడు పిల్లల చదువు, వివాహం, గృహ నిర్మాణం, పదవీ విరమణల కోసం నాలుగు పథకాలను ప్రారంభించి అవసరమైనప్పుడు వాటిని మాత్రమే విరమించుకునేలా ప్రణాళిక వేసుకోవచ్చు. పాక్షిక విరమణలు మొత్తం వ్యవధిలో నాలుగుసార్లు ఉండగా, ఇప్పుడు వాటిని ఆరు పర్యాయాలకు పెంచారు.

### సింగపూర్ స్ఫూర్తితో...

జాతీయ పెన్షన్ పథకంలో ఇంతకుముందున్న ఈక్విటీ పథకాల్లో నిదానంగా 10-13శాతం లాభాలు రావడం ఆకర్షణీయంగా ఉంది. అభివృద్ధి చెందుతున్న మన ఆర్థిక వ్యవస్థలో ఈక్విటీ లాభాలు ఇంకా ప్రోత్సాహకరంగా ఉండవచ్చని వివిధ ఆర్థిక సంస్థలు భావిస్తున్నాయి. ఇలాంటి తరుణంలో, మల్టీ స్కీమ్ ఫ్రేమ్‌వర్క్ ద్వారా ప్రభుత్వేతర చందాదారులకు వందశాతం ఈక్విటీకి అవకాశం కల్పించారు. మ్యూచువల్ ఫండ్స్‌లో దీర్ఘకాలిక పెట్టుబడులపై వచ్చే లాభాలకు చివరిలో పన్ను కట్టాల్సి వస్తుంది కాబట్టి- ఇలాంటి వారంతా ఇప్పుడు నూతన పింఛన్ పథకాన్ని ఎంచుకునే అవకాశముంది. 'ఉద్యోగుల పింఛను పథకం-1995'లో చేరడానికి 2014 సెప్టెంబరు నుంచి గరిష్ఠ వేతనం రూ.15వేలు దాటినవారు అనర్హులు. కాబట్టి, అధిక పింఛన్ కోరుకునే కొత్త తరానికి కొత్త ఎన్పీఎస్ మంచి అవకాశం కాగలుగుతుంది. పెన్షన్ ఫండ్ నిర్వహణలో ప్రపంచంలోనే అగ్రగామిగా ఉన్న సింగపూర్ వంటి దేశాల్లో పింఛన్ నిధులను స్థిరాస్తి రంగానికి మళ్లించేందుకు అనుమతులున్నాయి. మన దేశంలో పింఛను నిధి నియంత్రణ, అభివృద్ధి ప్రాధికార సంస్థ సమీప భవిష్యత్తులోనే పెన్షన్ ఫండ్‌లను బంగారం, వెండి ఈటీఎఫ్‌లలో పెట్టుబడులు పెట్టేందుకు అనుమతించవచ్చని చెబుతున్నారు. ఇవన్నీ వాస్తవరూపం దాల్చి, మన పెన్షన్ ఫండ్ కూడా అధిక లాభాలను కళ్లజూస్తే- భారత్ కలగంటున్న 'టువర్డ్స్ పెన్షన్ సొసైటీ' దిశగా అడుగులు పడినట్లే!

# ఓ ట్రంపూ.... నీ రాజ్యదాహం చల్లారదా?



వాషింగ్టన్:ఇంతకూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అమెరికాకు అధ్యక్షుడా.. .ప్రపంచాధ్యక్షుడా....అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి.ఇంతకూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అమెరికాకు అధ్యక్షుడా...ప్రపంచాధ్యక్షుడా....అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. తన తెంపరితనం, మొండితనంతో ప్రపంచ దేశాలపై కొరడాఝళిపించాలన్న ట్రంప్ అత్యుత్సాహం పలువురికి ఇబ్బందికరంగా మరికొందరికి కంటకంగా మారుతోంది. రాజులకు రాజ్యకాంక్ష ఉండేది, అందుకే రక్తపాతం పారించారని గత చరిత్ర చెబుతోంది. అందుకే ఏ దేశచరిత్ర చూసినా ఏమున్నది గర్వకారణం అంటూ శ్రీశ్రీ పెదవి విరిచాడు. రాజులు పోయారు...రాజ్యాలు పోయాయి. ప్రజాస్వామ్యం వచ్చింది...ఇపుడు ప్రజలే ప్రభువులు అంటున్న ఆధునిక యుగంలోనూ ట్రంప్ నిరంకుశంగా పరదేశాలన కబళించేందుకు ప్రయత్నించడాన్ని చాలా మంది తీవ్రంగా నిరసిస్తున్నారు. ఇంత కిరాతంగా వ్యవహరిస్తూ మరో పక్క తాను ప్రపంచ శాంతిదూతనని తనకు శాంతి నోబెల్ బహుమతి రావాల్సిందేనని ప్రకటిస్తుంటాడు. ట్రంప్ కచ్చితంగా అపరచితుడు టైపే అని చెప్పాలి. లేకపోతే శాంతి కోరుకునే వారెవరైనా యుద్ధాలు ప్రకటిస్తారా? దేశాలను చెరబట్టేందుకు దుస్సాహసం చేస్తారా?ట్రంప్ పైకి కనిపించినంత బోళామనిషి కానేకాదు. అతనిలో రాజ్యకాంక్ష చాలా విపరీతంగా ఉంది. మొన్నటి మొన్న వెనిజులా అధ్యక్షుడు మదురో, అతని భార్యను సిలియాను అత్యంత అమానవీయ ధోరణిలో బేడీలు వేసి మరీ నిర్బంధించడం ప్రపంచదేశాలన్నీ విస్తుపోయి చూశాయి. అనంతరం వెనిజులాకు తాత్కాలిక అధ్యక్షురాలిగా డెల్సీ రోడ్రిగ్జ్ బాధ్యతలు స్వీకరించారు. వెనిజులా అధ్యక్షుడు నికొలస్ మదురో మాదక ద్రవ్యాలను అమెరికాకు సరఫరా చేసే ముఠాతో జట్టు కట్టాడని ఆరోపించి మరీ అతణ్ని నిర్బంధించాడు ట్రంప్. ఈ తీరు ట్రంప్ కు బాగా అలవాటై పోయింది. తన దారిలోకి రాని వారిపై అభాండాలు వేయడం, వారి వల్ల అమెరికాకు హాని ఉందని అంటూ దాడులకు దిగడం ఇదే ట్రంప్ శైలి. అందుకే వెనిజులా అధ్యక్షుడిపై ట్రంప్ మోపిన ఆరోపణలు తేలిపోతున్నాయి. అయినా సరే వెనక్కి తగ్గకుండా...అధ్యక్షుణ్ని నిర్బంధించాడు. అంతటితో ఆగకుండా..తాజాగా వెనిజుల తాత్కాలిక అధ్యక్షుణ్ని నేనే అంటూ తన ట్రూత్ సోషల్ మీడియాలో ఓ స్క్రీన్ షాట్ ను షేర్ చేశాడు. పొటో కింద ఈ ఏడాది జనవరి నుంచి వెనిజులాకు తాత్కాలిక అధ్యక్షుడిగా బాధ్యతలు తీసుకున్నట్లు రాసి ఉంది. ఈ వ్యవహారం ఇపుడు సోషల్ మీడియానే కాదు మెయిన్ మీడియాలో కూడా సంచలనంగా మారుతోంది.వెనిజులా వ్యవహారం ఇలా ముదురుతుండగానే...ట్రంప్ కన్ను డెన్మార్క్ లోని గ్రీన్ ల్యాండ్ ద్వీపం పై పడింది. ఎలాగైనా ఆ ద్వీపాన్ని హస్తగతం చేసుకోవాలని మరోసారి ఉవ్విళ్ళూరుతున్నాడు. ఉత్తర అమెరికా, యూరప్ మధ్యలో ఉన్న ఈ ద్వీపం సొంతమైతే అమెరికాకు యుద్ధవ్యూహాలు రచించడం మరింత సులువవుతుంది. అమెరికా సైన్యానికి ఇది వ్యూహాత్మక ప్రాంతమవుతుంది. ఇప్పటికే వాయవ్య గ్రీన్ ల్యాండ్ ప్రాంతంలో అమెరికా సైనిక స్థావరముంది. అరుదైన ఖనిజాలకు పుట్టినిల్లుగా ఉన్న గ్రీన్ ల్యాండ్ సొంతమైతే...ఖనిజాల కోసం చైనా పై ఆధారపడే అవస్థ తప్పుతుందని ట్రంప్ దురాలోచన. 2019లో తొలిసారిగా అమెరికా అధ్యక్షుడిగా ఎంపికైన సందర్భంలోనే గ్రీన్ ల్యాండ్ కొనుగోలుకు బేరసారాలాడాడు. అప్పట్లో ప్రభుత్వానికి డబ్బు ఆఫర్ చేస్తే...ఇపుడు ఏకంగా ప్రజల్నే ప్రలోభపెట్టే తతంగానికి తెరలేపాడు. డాలర్లు కుమ్మరించయినా సరే గ్రీన్ ల్యాండ్ ను సొంతం చేసుకోవాలని దుర్బుద్ధితో ఉన్నాడు. ఇది కచ్చితంగా నిరంకుశ ధోరణి కాకపోతే మరేంటి?ఆందోళనలతో అట్టుడుకుతున్న ఇరాన్ మంటల్లో చలికాచుకోడానికి కూడా ట్రంప్ వెనకాడట్లేదు. ఇరాన్ లో నరమేధం జరుగుతోందని, ప్రజల ప్రాణరక్షణ కరవవుతోందని దొంగఏడ్పులు ఏడుస్తూ....తమ దేశంలో తలదాచుకున్న ఇరాన్ బహిష్కృత యువరాజు రెజీ పహ్లవిని ఎగదోస్తున్నాడు. ఎలాగైనా ఇరాన్ వ్యవహారాన్ని తనకు అనుకూలంగా మార్చుకోడానికి పన్నాగాలు పన్నుతున్నాడు. ఇరాన్ ఆంతరంగిక వ్యవహారాల్లో తలదూరిస్తే సహించేది లేదని, అలా జరిగితే అమెరికా మిలటరీ స్థావరాలపై దాడులు తప్పవని టెహ్రాన్ వర్గం హెచ్చరించినా బ్రహ్మచెముడు ట్రంప్ కు అది తలకెక్కడం లేదు. పైగా ఇరాన్ పరిణామాలు నిశితంగా గమనిస్తున్నామని, గంటగంటకు నివేదికలు తెప్పించుకుంటున్నామని పరిస్థితులు చేయిదాటితే రంగప్రవేశం కచ్చితంగా చేస్తామని ట్రంప్ అంటున్నాడు. అంటే అశాంతి మీరే రగిల్చి...దేశం ఆందోళనలో ఉందని మీరే చెప్పి...ఇరాన్ అస్థిరపరచి ఆ తర్వాత పబ్బం గడుపుకోవాలనేగా మీ దురాలోచన అని ప్రపంచ దేశాలు దుమ్మెత్తిపోస్తున్నాయి.ఇక సిరియాపై కూడా ట్రంప్ ది ఇదే దురాలోచన. సిరియాలో ఐసిస్ స్థావరాలను లక్ష్యంగా చేసుకుని భారీ స్థాయిలో వైమానిక దాడులు ప్రారంభించినట్లు ట్రంప్ ప్రభుత్వం ప్రకటించింది. ఇటీవల సిరియా ఐసిస్ ఉగ్రదాడుల్లో ఇద్దరు అమెరికన్లు మరణించారు. సిరియాలో ఉగ్రవాదుల్ని నిర్వీర్యం చేయాలన్న నెపంతో అమెరికా ఆపరేషన్ హాక్ ఐ స్ట్రైక్ ప్రారంభించింది. గత డిసెంబర్ 13న పాల్మైరా ప్రాంతంలో అమెరికా దళాలపై జరిగిన దాడికి ఇది ప్రతీకార ఆపరేషన్ గా అమెరికా అభివర్ణించుకుంది. అలాగే మెక్సికో, క్యూబా, కొలంబియా డ్రగ్స్ తయారు చేస్తూ.. అక్రమంగా అమెరికాలోకి సరఫరా చేస్తున్నాయని ట్రంప్ తాజాగా ఆరోపించారు. అనేక ముఠాలకు కూడా ఈ దేశాలు ఆశ్రయమిస్తున్నాయని గుర్తు చేశారు. ఇప్పటికైనా.. పద్ధతి మార్చుకోకపోతే.. వెనిజులా పరిస్థితే ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. పై ఘటనలన్నీ వరసగా గమనిస్తే ట్రంప్ వ్యవహారశైలి మనకు సులువుగానే అర్థమవుతుంది. కుక్కను కొట్టేటపుడు పిచ్చికుక్క అని ముద్ర వేయాలని అన్నట్లు ఓ దేశంపై ఆధిపత్యం చెలాయించాలని ట్రంప్ అనుకుంటే వెంటనే ఆదేశం మాదక ద్రవ్యాలకు స్థావరంగా మారిపోతుంది. అంతేకాదు అమెరికాకు సరఫరా చేసేస్తుంది. ఇలా చెబుతూనే ట్రంప్ రెచ్చిపోతున్నాడు. వివిధ దేశాలను హెచ్చరిస్తున్నాడు. ట్రంప్ శైలి ఇలాగే కొనసాగితే కచ్చితంగా అగ్రరాజ్యం అమెరికాకు ప్రపంచంలోని ఇతర దేశాలకు మధ్య బంధాలు దెబ్బతింటాయి. చాలా వేగంగా అమెరికా ఒంటరిగా మిగిలిపోయే ప్రమాదముందని, ఇప్పటికైనా ఆ దేశ రాజకీయ నేతలు ఈ విషయాన్ని తెలుసుకోవాలని విశ్లేషకులు అంటున్నారు.

# రాష్ట్రంపై కేంద్రానికి ఎందుకీ చిన్నచూపు?



న్యూఢిల్లీ,కేంద్ర ప్రభుత్వం ఈసారైనా బడ్జెట్‌లో తెలంగాణ అభివృద్ధి ప్రాజెక్టులకు తగిన నిధులు కేటాయిస్తుందా లేక సవతి తల్లి ప్రేమ చూపిస్తుందా అన్నది ప్రస్తుతం చర్చనీయాంశమవుతోంది. ఆర్థిక బాధ్యత మరియు బడ్జెట్ నిర్వహణ చట్టం (ఫిస్కల్ రెస్పాన్సిబిలిటీ అండ్ బడ్జెట్ మేనేజ్‌మెంట్ యాక్ట్ ఎఫ్‌ఆర్‌బిఎం) రుణ పరిమితిని ప్రస్తుతం ఉన్న 3.5 శాతం నుంచి 4 శాతానికి పెంచాలని తెలంగాణ ప్రభుత్వం కేంద్రాన్ని అభ్యర్థిస్తోంది. ఈమేరకు ఢిల్లీలో శనివారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ అధ్యక్షతన జరిగిన రాష్ట్రాల ఆర్థిక మంత్రుల సమావేశంలో తెలంగాణ డిప్యూటీ సిఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ప్రత్యక్షంగా కేంద్ర ఆర్థిక మంత్రిని కోరారు. ఎఫ్‌ఆర్‌బిఎంను 2003లో అమలులోకి తెచ్చారు. ప్రభుత్వ నిధుల నిర్వహణను మెరుగుపర్చడం, పారదర్శకతను తీసుకురావడమే ఈ పథకం ముఖ్యలక్షం. ముఖ్యంగా ద్రవ్యలోటును తగ్గించడానికే ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. అయితే ప్రస్తుతం ఎఫ్‌ఆర్‌బిఎం పరిమితులు సంక్షమం, అభివృద్ధి కార్యక్రమాల అమలుకు అడ్డంకిగా మారాయని తెలంగాణ ఆర్థిక మంత్రి తన వాదనను వినిపించారు.కేంద్ర మంత్రికి రాష్ట్ర మంత్రి భట్టి అనేక అంశాలను విన్నవించారు. వాటిలో గత కొన్నేళ్లుగా నలుగుతున్న అంశం పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం. జాతీయ ప్రాజెక్టుగా ఈ పథకాన్ని గుర్తించాలని గతంలో కూడా తెలంగాణ ప్రభుత్వం పదేపదే కోరినా కేంద్రం పట్టించుకోవడం లేదు. 2024 బడ్జెట్‌లో ఈ పథకం సంగతే కేంద్రం ప్రస్తావించలేదు. మళ్లీ ఈసారి కూడా ఈ ప్రాజెక్టు గురించే భట్టి కేంద్రానికి గుర్తు చేశారు. కేంద్రం నుంచి గ్రాంట్ల పద్దు కింద పూర్తి స్థాయిలో నిధులు రావడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గతంలో ప్రధాని మోదీ దృష్టికి కూడా తీసుకు వచ్చారు. కేంద్ర పథకాల ద్వారా అన్ని రాష్ట్రాలకు జనాభా నిష్పత్తిలో నిధులు కేటాయించాలని కోరినా ఫలితం కనిపించడం లేదు. ఇప్పటివరకు జరిగిన కేటాయింపులను పరిశీలిస్తే ఉదాహరణకు కేంద్ర ప్రాయోజిత పథకాల ( సిఎస్ఎస్ )కింద అన్ని రాష్ట్రాలకు కలిపి కేంద్రం రూ.4.60 లక్షల కోట్లను విడుదల చేసింది. జనాభా ప్రాతిపదికన పరిశీలిస్తే తెలంగాణకు 3 శాతం కింద దాదాపు రూ. 14 వేలకోట్లు రావలసి ఉంది.కానీ కేవలం 1.4 శాతం అంటే రూ.6577 కోట్లు మాత్రమే తెలంగాణకు వచ్చాయి. అంటే సగం కన్నా చాలా తక్కువ. అలాగే అంతకు ముందు కేంద్రం నుంచి గ్రాంట్లుగా రూ. 41,259 కోట్లు తెలంగాణ బడ్జెట్‌కు వస్తాయని అంచనా వేయగా, రూ. 9729 కోట్లు మాత్రమే వచ్చాయి. దీంతో అనేక శాఖలకు అనుకున్న విధంగా నిధులు లభించని పరిస్థితి ఏర్పడింది. తెలంగాణ ఆర్థిక శాఖ చెబుతున్న అంచనాల ప్రకారం సెస్‌లు, సర్‌ఛార్జీల ద్వారా కేంద్రానికి దాదాపు 20 శాతం తెలంగాణ నుంచి ఆదాయం లభిస్తోంది. అయితే ఈ ఆదాయాన్ని పన్నుల్లో చూపకపోవడం వల్ల అందులో వాటా రాష్ట్రాలకు రావడం లేదు. ఫలితంగా ఆర్థిక సంఘం సిఫార్సుల ప్రకారం రాష్ట్రాలకు రావలసిన 41 శాతం వాటాకు బదులు 30 శాతం మాత్రమే అందుతోంది. ఈ లోపాన్ని సరిదిద్దడానికి రూ. 1.55 లక్షల కోట్ల సర్‌ఛార్జీలను మౌలిక సదుపాయాల నిధికి మళ్లించి రాష్ట్రాలకు అందించాలని, లేదంటే ప్రాథమిక పన్ను రేట్లలో కలిపి రాష్ట్రాలకు పంపిణీ చేయాలని భట్టి కేంద్ర ఆర్థిక మంత్రి సీతారామన్‌కు విజ్ఞప్తి చేశారు. 15 వ ఆర్థిక సంఘం రాష్ట్రాల వారీగా చేసిన ప్రత్యేక సిఫార్సుల అమలును కేంద్ర ప్రభుత్వం అటకెక్కించింది. దీనివల్ల తెలంగాణ స్టేట్ స్పెసిఫిక్ గ్రాంట్లు రూ. 2362 కోట్లు, సెక్టార్ స్పెసిఫిక్ గ్రాంట్లు రూ. 3024 కోట్లు వరకు తెలంగాణ నష్టపోవలసి వచ్చింది. ఇప్పుడు 16 వ ఆర్థిక సంఘం రాష్ట్రాలకు ప్రత్యేకంగా చేసిన సిఫార్సులను ఆమోదించడంలో ఈసారి కూడా ఉపేక్షిస్తే గతంలో మాదిరిగా తెలంగాణకు భారీ నష్టం కలగక తప్పదు.అందుకనే ఆ సిఫార్సులను యథతథంగా అమలు చేయాలన్నదే తెలంగాణ అభ్యర్థన. మరి ఎంతవరకు కేంద్రం ఈ అభ్యర్థనను మన్నిస్తుందో గమనించాలి. 202526 వార్షిక బడ్జెట్‌ను కేంద్ర ప్రభుత్వం గత ఏడాది ఫిబ్రవరి 1న ప్రవేశ పెట్టినపుడు 2025 బడ్జెట్‌లో భారీగా నిధులు కేటాయించినట్టు ప్రచారం జరిగింది. మరి ఈ పొరపాటు ఎలా జరిగిందో తెలీదు. సోషల్ మీడియాలో మాత్రం గణాంకాలతో సహా వైరల్ కావడం విస్మయం కలిగించింది.ఆ కేటాయింపులు ఎంతవరకు వాస్తవమో పరిశీలిస్తే అవన్నీ దేశం మొత్తం మీద అన్ని రాష్ట్రాలకు కలిపి ఆయా పథకాలకు కేందం కేటాయించిన నిధుల వివరాలని స్పష్టమైంది. తెలంగాణకు రూ.1.5 లక్షల కోట్ల వడ్డీ లేని రుణాన్ని మంజూరు చేసినట్టు వైరల్ కాగా, అంతమొత్తం తెలంగాణకు వడ్డీ లేని రుణంగా కేటాయించలేదని బయటపడింది.మూలధన వ్యయం, సంస్కరణల ప్రోత్సాహకాల కోసం అన్ని రాష్ట్రాలకు 50 సంవత్సరాల వడ్డీ లేని రుణాలు పొందేందుకు కేంద్ర ప్రభుత్వం రూ. 1,50,000 కోట్లు ప్రతిపాదించినట్టు తేలింది. అలాగే అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద రూ. 10,000 కోట్లు, గ్రామీణ సడక్ యోజనకు రూ. 16,600 కోట్లు, ఆసరా పెన్షన్ల కోసం రూ. 9632 కోట్లు, పిఎం ఆవాస్ కోసం పట్టణ ప్రాంతాల్లో రూ.19794 కోట్లు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.34,426 కోట్లు, గృహ రుణ మాఫీ కోసం రూ.3500 కోట్లు కేటాయించినట్టు సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఇవన్నీ దేశ వ్యాప్త పథకాలవే కావడం గమనార్హం. ఇంతకీ వార్షిక బడ్జెట్ 2025లో వివిధ పథకాల కింద తెలంగాణకు కేటాయించిన నిధుల వివరాలు సోషల్ మీడియాలో వెల్లడి కాకపోవడం అనేక అపోహలకు దారి తీసింది. ఇలా ఉండగా విభజన హామీల అమలు గురించి దాదాపు పదేళ్లుగా తెలంగాణ ఎదురు చూస్తున్నా నిరాశే మిగులుతోంది.

## భోగిపళ్లు పోయడం తెలుగువారి ఆచారం

రాజమహేంద్రవరం,తెలుగు ప్రజలు జరుపుకొనే ముఖ్యమైన పండుగ సంక్రాంతి. ఈ పండుగను మూడు రోజుల పాటు ఘనంగా జరుపుకొంటారు. ఈ మూడు రోజుల్లో తొలి రోజును భోగి పండుగగా.. రెండో రోజును మకర సంక్రాంతి పండుగగా.. మూడో రోజును కనుమ పండుగగా పిలుస్తారు. అయితే.. ఈ భోగి పండుగ రోజు ఆచరించే ప్రధానమైన ఆచారాల్లో భోగి మంటలు వేయడమే కాకుండా భోగి పళ్లు పోయడం కూడా ఉంటుంది. భోగి పండుగ రోజు సాయంత్రం పెద్దలు తమ ఇంట్లోని ఐదు లేదా ఆరేళ్లలోపు చిన్నారుల తలపై రేగుపళ్లు పోస్తారు. వీటినే భోగి పళ్లు అంటారు. ఈ భోగి పండ్ల కోసం రేగు పండ్లు, చెరుకు గడలు, బంతిపూల రెక్కలు, చిల్లర నాణెలిలు తీసుకుంటారు.

## నెలరోజులుగా వైష్ణవాలయాల్లో తిరుప్పావై పఠనం

తిరుమల,సూర్యుడు ఏడాదిలో ప్రతి నెలా ఒక్కో రాశిలో సంచరిస్తుంటాడు. సౌరమానం ప్రకారం సూర్యుడు ఏ రాశిలో ఉంటే ఆ నెలను ఆ రాశి పేరుతో పిలుస్తారు. సూర్యుడు ధనస్సు రాశిలో ప్రవేశించి మళ్లీ మకర రాశిలోకి వెళ్లే వరకూ ఉన్న సమయమే ధనుర్మాసం. దక్షిణాయనం దేవతలకు రాత్రి. ఉత్తరాయణం పగలు. ఉత్తరాయణం ముందు వచ్చే ధనుర్మాసం దేవతలకు బ్రాహ్మీ సమయం. సూర్యదేవుడు ధనుస్సురాశిలో ప్రవేశించడంతో మొదలై భోగిపండుగ రోజువరకూ, సూర్యుడు మకరరాశిలోకి ప్రవేశించేంతవరకూ ఉండే మాసం ధనుర్మాసంగా ఆచరించారు. వైష్ణవ సాంప్రదాయంలో అత్యంత పవిత్రమైన మాసం ఇది. అందుకు గత నెల రోజులుగా వైష్ణవాలయాల్లో తిరుప్పావై ప్రవచనాలు సాగాయి. భోగిరోజు గోదా కళ్యాణంతో ధనుర్మాస ఉత్సవాలు ముగుస్తాయి. ఈ మాసమంతా వైష్ణవాలయాల్లో ప్రత్యేక పూజలు చేపట్టారు. గోదాదేవి రచించిన 'తిరుప్పావై' ని ఈ మాసం రోజులు పఠించారు. ముఖ్యంగా కలియుగ వైకుంఠమైన తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ఈ నెల రోజులు సుప్రభాతానికి బదులుగా తిరుప్పావైని పఠించారు. అటువంటి పవిత్రమైన ధనుర్మాసంలో శ్రీమహావిష్ణువును 'మధుసూదనుడు' అనే పేరుతో పూజించడం ఆనవాయితీ. శ్రీరగంలో ధనుర్మాస ఉత్సవాలకు ప్రత్యేకత ఉంది. అక్కడి శ్రీరంగనాథుడి కోవెలలో ధనుర్మాస ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ధనుర్మాసం మొత్తం ఇంటి ముందు ఆవుపేడను కలిపిన నీటిని చల్లి బియ్యపుపిండితో అందమైన ముగ్గులు పెట్టి, ముగ్గుల మధ్యలో ఆవు పేడతో చేసి, పసుపు, కుంకుమలు, వివిధ పూలను అలంకరించిన గొబ్బిళ్ళను ఉంచాలి. ఈ విధంగా చేయడం వల్ల కన్యకు మంచి భర్త లభిస్తాడు, సౌభాగ్యం కలకాలం వర్ధిల్లుతుంది అని నమ్మకం. గోదాదేవి కల్యాణం, కాత్యాయని, శ్రీవ్రతం చేస్తే సకలశుభాలు కలుగుతాయని భక్తులు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. తెల్లవారుజామున నిద్రలేచి భక్తిశ్రద్ధలతో ప్రతిమను తయారుచేసి నారాయణుడి ఆవాహన పూజలు చేస్తారు. రోజూ పూజకు పంచామృత స్నానం, తులసి దళాలతో అర్చన, నైవేద్యాలుగా నెయ్యి, బియ్యం, బెల్లం, మిరియాలు, పెసరపప్పు, పొంగలి, జీలకర్ర వేసి తయారు చేసిన నైవేద్యాన్ని సమర్పించాలి. ధనుర్మాసం ప్రారంభమైన నాటి నుంచి పక్షం రోజులు ఈ నైవేద్యాలను, మిగిలిన పక్షం రోజులు దద్ధోజనాన్ని నైవేద్యంగా సమర్పించాలి. సూత, శౌనకాది మహామునులు వ్రత విధానాన్ని బోధించినట్లు పురాణాలు వెల్లడిస్తున్నాయి. ధనస్సు సంక్రమణం మొదలు మకర సంక్రమణం వరకు వ్రతాన్ని ఆచరిస్తారు. దీనిని కాత్యాయనీ వ్రతంగా కొందరు ఆచరిస్తారు. ధనుర్మాసంలో గోదారంగనాథ స్వామిని ఆరాధించడం మూలంగా సకల శుభాలు కలుగుతాయని భక్తుల నమ్మకం. ఈ మాసంలో పాశురాలను చదవడం వల్ల ఎంతో పుణ్యఫలం లభిస్తోంది. ధనుర్మాస వ్రతం ఆచరించడం వలన చాలా పుణ్యం లభిస్తుందని పండితులు చెబుతున్నారు. మాసం రోజులు భగవంతుడిని ఆరాధించి పుణ్య ఫలాలను పొందాలని పండితులు సూచిస్తున్నారు.

## విగ్రహ రూపంలో ఉన్న స్వామిని పరిణమాడిన గోదాదేవి

శ్రీరంగం,తిరుప్పావై, గోదాదేవి కళ్యాణానికి తమిళనాడులోని శ్రీరంగం విశేష ప్రాధన్యం ఉంది. మిగతా కళ్యాణాలతో పోలిస్తే గోదా రంగనాథుల కళ్యాణానికి ఒక విశేషం ఉంది. అన్ని కళ్యాణోత్సవాలతో స్వామికి వైభవం ఉంటే గోదా రంగనాథుల కళ్యాణంలో మాత్రం వైభవం అంతా అమ్మ గోదా దేవికే ఉంటుంది. విష్ణుచిత్తుని కూతరుగా పెరిగిన అమ్మవారు శ్రీరంగనాథుడిని వలచి వరించి స్వామిలో ఐక్యం చెందిన ఇతిహాస పురాణం ఉంది. మిగిలిన దేవతా కళ్యాణోత్సవాలతో పోలిస్తే గోదా రంగనాథుల గోదా కళ్యాణం ప్రత్యేకతకు రెండు కారణాలు ఉన్నాయి. గోదాదేవి అద్భుతమైన వ్రతాన్ని ఆచరించి, ఆ ఆచరించిన దాన్ని మన దాకా ఆచరించేట్టుగా చేసింది అందుకే 'పాడియరుళవల్ల పల్-వళై యాయ్' అని అంటుంటాం. తాను ఆచరించిన దాన్ని ఎంతో కాలం దాక ఆచరించగలిగేట్టుగా ప్రబంధాన్ని అందించింది. అది గోదా దేవి గొప్పతనం. ఇది వరకు ఇలాంటి వ్రతాన్ని గోపికలు చేసారు కానీ వారు తరువాతి వారికి ఏమి అందించలేదు శ్రీకృష్ణుని అనుభవాన్ని పొంది ఊరుకున్నారు. గోదాదేవి నిత్యం ఆచరించి తెలియచేసిన కీర్తనలే తిరుప్పావై పాశురాలుగా ప్రసిద్ధి చెందాయి. సీతమ్మ రామచంద్రుణ్ణి వివాహమాడి ఊరుకుంది, పద్మావతి అమ్మవారు శ్రీనివాసున్ని వివాహమాడి ఊరుకుంది, కానీ గోదాదేవి ఒక్కో పాటలో మనం ఏం తెలుసుకోవాలి, ఎలా తెలుసుకోవాలి, ఎలా ఆచరించాలో చెప్పింది. సీతమ్మ కానీ పద్మావతి అమ్మవారు కానీ భగవంతుణ్ణి తనవంటి కదిలే రూపంలోనే వివాహ మాడారు. కానీ గోదా దేవి మానవకన్యగా ఉంటూ విగ్రహ స్వరూపుడైన రంగనాథున్ని వివాహమాడింది. ఆ వైభవమే తిరుప్పావైగా నెలరోజులు సాగిన తరవాత భోగి రోజు గోదాకళ్యాణంతో ముగిస్తారు. తన ఆచరణతో విగ్రహ స్వరూపుడైన భగవంతుణ్ణి కదిలేట్టు చేసుకుంది. ఇదే అమ్మవారి యొక్క గొప్పతనం. మన ఎదురుగుండా కనిపించే విగ్రహాన్ని, అది దైవమని విశ్వసించి, మనం చెప్పినట్లుగా మనం పిలిచినట్లుగా అది కదలగలుగుతుంది, పలకగలుగుతుంది అనే విశ్వాసాన్ని ఆండాళ్ తల్లి నిరూపించి చూపించింది. 'ఉలగనిల్ తోత్రమాయ్ నింద్ర శుడరే తుయిలెరాయ్', అంది అమ్మ అంటే లోకంలో కంటికి కనిపించేట్టుగా విగ్రహరూపంలొ ఉండే భగవంతుడా! ఆ విగ్రహ రూపంలో నీ ప్రభావము అనుపమానము, అసమానము అని విశ్వసిస్తున్నాను అని చెప్పి భగవంతుణ్ణి కదిలేట్టు చేసింది. మూడు పనులు చేసి విగ్రహరూపంలొ ఉండే భగవంతుణ్ణి కదిలేట్టు చేసింది. అవి కృష్ణమ్ ఉద్భోధ్య, కృష్ణమ్ అధ్యాపయంతి మరియూ 'కృష్ణమ్ బలాత్కృత్య భూంక్తే'. ఆయన ఏమి ఉలకకుండా పడుకుంటే మేల్కొల్పింది. చిన్న పిల్లవాడికి బెత్తం చూపి పాఠం చెప్పినట్లుగా, మనల్ని బాగుచేయడానికి, మనం తెలుసుకోవలసిన విషయాలని మనకి ఆయన ఎట్లా తెలిసేట్టు చేయాలో ఆయనకి పాఠాలు నేర్పింది. అంతే కాదు స్వామి విగ్రహరూపంలో ఉన్నా ఆయన్ని నిర్బందించి, బంధించి, ఆయన్ని పొందింది. అందుకే ఎక్కడో శ్రీవిల్లిపుత్తూరులో ఆండాళ్ ఉంటే, శ్రీరంగంలో ఉన్న స్వామి స్పందించి అర్చకులని, రాజుని అమ్మని తీసుకురమ్మని ప్రేరేపించి రప్పించుకున్నాడు. విగ్రహంలో ఉన్న స్వామితో వివాహమని తెలియగానే జనాలు తండోపతండాలుగా తరలి వచ్చి ఆశ్చర్యపోయినందుకే ఆ వీదికి చిత్ర వీది అనే పేరు ఏర్పడిపోయింది.

## ఆగని బంగారం పరుగులు

న్యూఢిల్లీ,వరుసగా పెరుగుతూ వస్తున్న బంగారం, వెండి ధరలు మంగళవారం కూడా భారీ పెరుగుదల నమోదు చేశాయి. భౌగోళిక రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో పెట్టుబడిదారులు సురక్షిత ఆస్తుల వైపు మొగ్గు చూపుతుండడంతో బంగారం, వెండిపై మదుపర్లు దృష్టి సారిస్తున్నారు. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి క్షీణిస్తుండడం కూడా బంగారం, వెండి ధరల డిమాండ్‌కు కారణంగా కనిపిస్తోంది.ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం 6:30 గంటల సమయంలో హైదరాబాద్‌లో 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర 1,42,160కి చేరింది. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,30,310కి చేరింది. ఇక, దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి రేటు రూ. 1,42,310కి చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ ధర రూ. 1,30,460కి చేరుకుంది. మరోవైపు వెండి కూడా భారీగా పెరిగింది. ఈ నేపథ్యంలో దేశంలోని పలు ప్రధాన నగరాల్లో బంగారం, వెండి ధరలు అమాంతంగా పెరిగాయి.

# వేరే లెవెల్...వెరీ స్ట్రాంగ్

న్యూఢిల్లీ,జెన్ జెడ్ అంటేనే భయం వేస్తోంది. కొన్ని దేశాలలో ఈ తరం పోకడలు చూస్తే ముచ్చెమటలు పడుతూంటాయి. దేశాన్ని మార్చేద్దామన్న ఉత్సాహంలో వారు చేసే దూకుడుతో ఏకంగా ప్రభుత్వాలే కుప్ప కూలుతున్నాయి. పాలకులే మాజీలు అయి బతుకు జీవుడా అనుకోవాల్సి వస్తోంది. కొంతమంది అయితే ప్రాణాలను అర చేత పట్టుకుని పారిపోవాల్సిన నేపథ్యం ఉంది. భారత్ కి ఇరుగు పొరుగు దేశాలలో చూసినా అలాగే ప్రపంచంలో జరుగుతున్న పరిణామాలు అధ్యయనం చేసినా కూడా ఇదే పోకడ కనిపిస్తుంది. మరీ ఎక్స్ ట్రీం థట్స్ తో జెన్ జెడ్ ఉంటోంది అన్నది ఓవరాల్ గా ఉన్న భావన. అయితే మన జెన్ జెడ్ మాత్రం అలాంటి వారు కాదని అంటున్నారు.

వారి వరల్డ్ వేరు :

భారతదేశపు జెన్–జెడ్ గ్రేట్ అంటూ కితాబు ఇస్తున్నది ఎవరో కాదు ప్రధాని నరేంద్ర మోడీ. వారు దేశం గర్వించేలా ఉంటున్నారు అని ఆయన అన్నారు. అంతే కాదు వారిది క్రియేట్ వరల్డ్ అని గుర్తు చేశారు. అలా వారు తమదైన శైలిలో నూతన ఆలోచనలు శక్తి సంకల్పం అన్నీ పెట్టి మరీ దేశ ప్రగతిలో పాలు పంచుకుంటున్నారు అని మోడీ కొనియాడారు. భారతీయ యువశక్తి దేశ నిర్మాణంలో ముందువరుసలో ఉందని ప్రధానమంత్రి చెప్పుకొచ్చారు.

యువతే కీలకం :

యువత దేశానికి ఎంతో కీలకం అవుతుందని ఆయన జోస్యం చెప్పారు. న్యూఢిల్లీలో జరిగిన వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ – 2026 ముగింపు సమావేశంలో ప్రధాని నరేంద్ర మోడీ ప్రసంగిస్తూ మన జెన్ జెడ్ సూపర్ అంటూ ప్రశంసల వర్షం కురిపించారు. ఇక 2047లో దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 100 ఏళ్లు పూర్తయ్యే నాటికి ఈనాటి యువత జీవితంలో అత్యంత కీలకమైన సమయం అవుతుందని నరేంద్ర మోడీ స్పష్టం చేశారు. వారికి ఇది ఒక సువర్ణావకాశం అని ఆయన అన్నారు. వారి సామర్థ్యమే భారతదేశ సామర్థ్యం గా మారుతుందని అలా వారి విజయం భారతదేశ విజయాన్ని కొత్త శిఖరాలకు తీసుకువెళ్తుందని నరేంద్ర మోడీ ధీమా వ్యక్తం చేశారు.

# ఆక్వాలో ట్రంప్ టారిఫ్‌ల అలజడి

రాజమహేంద్రవరం : అమెరికా విధించిన టారిఫ్‌లతో మన రొయ్య ఎదురీదుతోంది. ఓ వైపు వాతావరణ మార్పులతో వ్యాధుల కారణంగా ఎదుగుదల లోపం, మరోవైపు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధిస్తున్న టారిఫ్‌లతో రొయ్యల సాగుపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. విదేశీ ఎగుమతులపైనే గోదావరి జిల్లాలో ఆక్వా సాగు జరుగుతోంది. 500 శాతం సుంకాలు పెంచుతామంటూ ట్రంప్ చేసిన తాజా ప్రకటించారు. అమెరికాలో ఈ బిల్లు ఈ నెల 15న సనెట్‌కు వెళ్లే అవకాశం ఉంది. దీంతో, ఆక్వా రైతులు, వ్యాపారుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 77,150 ఎకరాల్లో ఆక్వా సాగవుతోంది. గతంలో 85 వేల ఎకరాల్లో ఆక్వా సాగు ఉండేది. గతేడాది నుంచి ట్రంపు సుంకాల నేపథ్యంలో చాలా మంది రైతులు ఆక్వా నుంచి తప్పుకున్నారు. ఇక్కడ 30 నుంచి 100 కౌంట్ వరకూ రొయ్యలను సాగుచేస్తున్నారు. 30 నుంచి 40 కౌంట్ సాగు ఎక్కువగా ఉంది. ఇదంతా అమెరికా ఎగుమతులను దృష్టిలో పెట్టుకునే సాగు చేస్తున్నారు. ఈ కౌంట్‌లో 60 శాతం రొయ్యలు అమెరికాకే ఎగుమతి అవుతున్నాయి. గతంలో ట్రంప్ విధించిన 50 శాతం సుంకాల నేపథ్యంలో ఆక్వా పరిశ్రమ తీవ్ర ఒడిదుడుకులకు లోనైంది. కనీసం ధర లేక రైతులు ఇబ్బందులు పడ్డారు. దీంతో చాలామంది ఆక్వా రైతులు స్థానికంగానే వీటిని అమ్ముకోవాల్సి వచ్చింది. గిట్టుబాటు కాకున్నా పంటను వచ్చిన కాడికి రైతులు అమ్ముకునే పరిస్థితి వచ్చింది. ప్రస్తుతం రైతుల నుంచి 30 కౌంట్ రొయ్యలు కేజీ రూ.400కు, వంద కౌంట్ కేజీ రూ.240కు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. 50 శాతం సుంకాల తర్వాత ఇప్పుడిప్పుడే ఆక్వా రైతు కోలుకుంటున్నారు. ఈ సమయంలో 500 శాతం టారిఫ్ విధిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించడంతో ఎగుమతిదారులు, రైతుల్లో మళ్లీ ఆందోళన మొదలైంది. జనవరి 15 తర్వాత అక్కడి దిగుమతిదారులు పెట్టే కొత్త ఆర్డర్లపైనే మన రొయ్యల మార్కెట్ ఆధారపడి ఉంటుంది. దీంతో, అమెరికాలో దిగుమతి చేసుకునే వ్యాపారులు ఏ నిర్ణయం తీసుకుంటారో అనేదానిపై ఎగుమతిదారులు ఉత్కంఠగా



ఉన్నారు. అక్కడ డిమాండ్‌ను బట్టి ఆర్డర్లు ఉంటాయి. ఇప్పటికే అమెరికా వ్యాపారులు టారిఫ్‌పై అక్కడి న్యాయస్థానాలను ఆశ్రయించారు. వాటి తీర్పుపై భవిష్యత్తు టారిఫ్ ఆధారపడి ఉంటుంది. అమెరికాకు ఎగుమతులు మందగిస్తే యూరప్, జపాన్, చైనా తదితర దేశాలపై ఇక్కడి ఆక్వా రైతులు ఆధారపడాల్సి వస్తుంది. ఇప్పటికిప్పుడు అంత విదేశీ మార్కెట్‌ను పెంచుకునే అవకాశం లేకపోవడంతో వారంతా ఆందోళనతో ఉన్నారు. అమెరికాలో మాత్రమే 30 నుంచి 40 కౌంట్ రొయ్యలను వినియోగిస్తారు. చైనా, జపాన్ దేశాల్లో వంద కౌంట్ వినియోగం ఎక్కువ. అయితే వంద కౌంటు రొయ్యలను ప్రోసెసింగ్ చేయాలంటే వ్యయప్రయాసలను భరించాలి. అదే ఇప్పుడు ఎగుమతిదారులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. గతేడాది నుంచి వచ్చిన ట్రంప్ టారిఫ్ విధానంతో ఇక్కడ రైతులు ఉత్పత్తి తగ్గించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఏటా ఆరు లక్షల టన్నుల రొయ్యలను ఉత్పత్తి చేస్తున్నారు.

వెంటాడుతున్న వ్యాధులు

కొన్నేళ్లుగా వరస తుపాన్ల నేపథ్యంలో చెరువుల్లో నీరు మారి 'ఎంటిరో సైటోజూన్ హిపటోపీనై (ఇహెచ్‌పి) అనే వ్యాధి సోకింది. దీంతో, రొయ్యల్లో ఎదుగుదల లోపం తలెత్తింది. సాధారణంగా జిల్లాలో ఏప్రిల్ నుంచి జులై వరకు మొదటి

# కోనసీమలో కోడిపందాల జోరు

కాకినాడ, గోదావరి జిల్లాల్లో ప్రాంతాల్లో భోగి రోజున కోడి పందాలు వేయడం ఒక ఆనవాయితీగా వస్తుంది, పౌరుషానికి ప్రతీకగా ఉండే కోళ్లు పోటీలో ప్రాణాలను పణ్ణంగా పెట్టి పోరాడుతాయి, ఈ పోటీలను చూసేందుకు ప్రజలు ఆసక్తి కనబరుస్తారు. పోటీలో పాల్గొనే కోళ్లపై పందాలు కాస్తారు. తాహత్తుకు మించి మితిమీరిన పందాలు కాయడం వలన కలిగే అనర్థాల వలన పందాలు కాయడంపై నిషేధాంక్షలు ఉన్నాయి. హిందూ మత ఆచారాల ప్రకారం, సూర్య భగవానుడు ధనస్సు రాశి నుంచి మకర రాశిలోకి ప్రవేశించే సమయాన్ని 'మకర సంక్రాంతి' అంటారు. ఈ పండుగకు సరిగ్గా ఒక రోజు ముందు 'భోగి' పండుగను జరుపుకుంటారు. ఈ పవిత్రమైన రోజున తెల్లవారుజామునే నిద్ర లేచి భోగి మంటలు వేస్తారన్న విషయం మనందరికీ తెలిసిందే.. అదే విధంగా చిన్నారులపై భోగి పళ్లను పోస్తారు. భోగి రోజు సాయంకాలం సమయంలో బొమ్మలకొలువును కూడా జరుపుతారు. కోనసీమలో సంక్రాంతి వేడుకలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఇక, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా ప్రారంభం అయ్యాయి. ఈ సంబరాల్లో భాగంగా మూడు రోజుల పాటు వివిధ రకాల పోటీలు నిర్వహించనున్నారు. జాతీయ స్థాయి పడవల పోటీలు జరగనున్నాయి. అంతేకాదు.. కోనసీమ రుచులు గురించి తెలుపుతూ ఫుడ్ ఫెస్టివల్ కూడా జరగనుంది. తొలిరోజు ఈత పోటీలు, రంగవల్లులు, ఫుడ్ ఫెస్టివల్ ఆకట్టుకుంటున్నాయి. జిల్లా కలెక్టర్ మహేశ్ కుమార్, ఎస్పీ రాహుల్ మీనా, ఎమ్మెల్యే బండారు సత్యనందరావు పోటీలను ప్రారంభించారు.

# అసలు ఏమి జరుగుతోంది. ?

అమరావతి,బీజేపీ సిద్ధాంతాలను తమ బుర్రల నిండా నింపుకుని కాషాయానికి దశాబ్దాలుగా అంకితం అయిపోయిన వారి కంటే ఎక్కువగా జనసేన అధినేత పవన్ కళ్యాణ్ బీజేపీతో కలిసి ఉన్నారు. ఆ పార్టీ ఫిలాసఫీని సొంత పార్టీ కంటే ఎక్కువగా ఆయన ప్రచారం చేయడమూ అంతా చూశారు. ఇన్నాళ్ళ తన రాజకీయ ప్రస్థానంలో బీజేపీ నేతలు ఎపుడూ సనాతన ధర్మం గురించి ఎక్కువగా ప్రస్తావించిన సందర్భాలు లేవు, కానీ ఆ పనిని పవన్ కళ్యాణ్ చేస్తూ వస్తున్నారు. ఒక విధంగా మాస్ లోకి హిందూత్వ నినాదాన్ని ఆయన తెలుగు నాట ఎంతో కొంత బలంగా తీసుకెళ్ళగలిగారు. మోడీ అంటే పవన్ కి ఒక విధమైన ఆరాధన భావం ఉంది. అది ఆయన స్వయంగా ఎన్నో సార్లు చెప్పుకున్నారు కూడా. బీజేపీని టీడీపీని కలిపి ఏపీలో కూటమిని కట్టడంలో పవన్ పాత్ర చాలా ఎక్కువ అని అంతా ఒప్పుకుంటారు.

ఎందుకీ దూరం :

అలాంటి పవన్ తెలంగాణాలో బీజేపీకి దూరం పాటిస్తున్నారా అన్న చర్చ ఒక వైపు సాగుతోంది. ఎందుకంటే తెలంగాణాలో ఫిబ్రవరి నెలలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో తాము ఒంటరిగా పోటీ చేస్తామని మొదట ప్రకటించింది జనసేననే. ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి తాళ్లూరి రామ్ ఈ మేరకు ప్రకటన కూడా చేశారు. తాము అడహాక్ కమిటీలను కూడా వేసుకుని ముందుకు సాగుతున్నామని కూడా చెప్పుకొచ్చారు. అంతే కాదు పవన్ కూడా సీరియస్ గానే లోకల్ బాడీ ఎన్నికలను తీసుకుంటున్నారని ఆయన జనంలోకి వచ్చి పర్యటనలు కూడా చేస్తారు అని అని తాళ్ళూరి రామ్ తాజాగా పేర్కొనడం జరిగింది. జనసేన ఈ విధంగా సోలోగా తెలంగాణాలో పోటీకి సిద్ధపడడం దానికి అనుగుణంగా కమిటీలని పార్టీ పరంగా ఏర్పాటు చేయడం అన్నది వేగంగా జరుగుతోంది. అలాగే స్థానిక ఎన్నికల కోసం భారీ రాజకీయ కార్యాచరణను సైతం సిద్ధం చేస్తున్నారు.

బీజేపీకి ఇబ్బందిగా :

నిజానికి తెలంగాణాలో సొంతంగా తాము ఎదిగి అధికారంలోకి రావాలని బీజేపీ చూస్తోంది. బీఆర్ఎస్ పాలనను కాంగ్రెస్ ఏలుబడిని చూసిన ప్రజలు తమకు ఒక చాన్స్ ఇస్తారని ఆ పార్టీ ఆశలు పెట్టుకుంది. ఇక స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ సత్తా చాటాలని చూస్తున్న బీజేపీకి జనసేన నుంచి వచ్చిన ఈ తాజా ప్రకటన అయితే మింగుడుపడటం లేదని అంటున్నారు. జనసేన ఆల్ ఆఫ్ సడెన్ గా ఎందుకు తెలంగాణా నుంచి ఎన్నికల బరిలోకి దిగే ఆలోచన చేస్తోంది అన్నది అయితే బీజేపీ కీలక నేతలకు అసలు అర్థం కావడం లేదని అంటున్నారు. ఆ పరిణామాల క్రమంలో కేంద్ర బీజేపీ పెద్దలు సైతం దీని మీద తెలంగాణా బీజేపీ నాయకత్వాని పూర్తి వివరాలను ఆరా తీస్తున్నారు అని అంటున్నారు.

ఒంటరిగానే అంటూ బీజేపీ :

ఇక ఈ దశలో బీజేపీ తెలంగాణా శాఖ కూడా తాము స్థానిక సంస్థల ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేస్తామని ప్రకటించడం విశేషం. ఆ మేరకు రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావు మీడియాతో మాట్లాడుతూ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. జనసేనతో పొత్తు ఉండదని ఆ అవసరం కూడా తమకు లేదని ఆయన తేల్చి చెప్పడం సరికొత్త రాజకీయ చర్చకు తావిస్తోంది. అయితే బీజేపీ చేసిన ఈ ప్రకటన మీద కూడా జనసేన ప్రధాన కార్యదర్శి తాళ్ళూరి రామ్ రియాక్ట్ అయ్యారు. తెలంగాణా మీద పవన్ కి ఎంతో ప్రేమ ఉందని చెప్పారు. అందుకే తెలంగాణాలో తొందరలో జరగబోయే మున్సిపల్, జీహెచ్ఎంసీ ఎన్నికల్లో పోటీ చేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు.

పొత్తులు లేనట్లేనా :

అయితే జనసేన కూడా పోటీకి దిగితే అది ఏ పార్టీ విజయావకాశాలు దెబ్బ తీస్తుంది అన్న చర్చ కూడా ఉంది. ఓట్లు చీలిపోతే దాని వల్ల ఇబ్బంది విపక్షలకు వస్తుంది. ఏపీలో బీజేపీ జనసేన పొత్తు కలిగి ఉన్నాయి. దాంతో తెలంగాణా బీజేపీ మీద ఆ ప్రభావం పడుతుందా అన్నది కూడా మరో చర్చగా ముందుకు వస్తోంది. ఈ నేపథ్యంలో జనసేన బీజేపీల మధ్య పొత్తులు కుదురుతాయా అన్నది కూడా చూడాల్సి ఉందని అంటున్నారు. బీజేపీ జాతీయ నాయకత్వంతో డైరెక్ట్ గా టచ్ లో జనసేన అధినేత ఉంటారు కాబట్టి అక్కడనే పొత్తుల మీద నిర్ణయం తీసుకుంటారా లేక ఎవరి మానాన వారు పోటీ చేస్తారా అన్నది కూడా చూడాల్సి ఉంది అని అంటున్నారు.

# మేడారం 'పునరుద్ధరణ'పై ఎందుకీ వివాదం!?



మేడారం: సమ్మక్క సారలమ్మల మహాజాతర నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా పునరుద్ధరణ పనులు చేపట్టింది. అయితే.. ఇవెందుకు వివాదాస్పదమవుతున్నాయి? ఈ పునరుద్ధరణ పనుల్లో అనేక సందేహాలు, ప్రశ్నలు ఎందుకు వస్తున్నాయి?ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార, వ్యవహారాలు, పూజా విధానం, ఆధ్యాత్మిక చింతన, జీవన విధానం, వారి గొట్టు, గోత్రాలకు.. స్థూలంగా కోయల చారిత్రక వారసత్వ పునర్జీవనానికి ప్రతీకగా పునరుద్ధరిస్తున్న ఈ పనులను ఉద్దేశ్యపూర్వకంగా వివాదం చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఈ విమర్శల్లో పాక్షకంగా నిజమున్నప్పటికీ ఈ పరిస్థితి ఉత్పన్నమవడానికి కారణమెవరు?అన్నింటా ఆధిపత్య సంస్కృతి తన పట్టును బిగిస్తున్న ఈ ఆధునిక కాలంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సాహసోపేతంగా మేడారం పునరుద్ధరణ పనులు చేపట్టింది. గత ప్రభుత్వాలకు భిన్నంగా ఎంతో ఉదార స్వభావంతో, విశాల భావనతో ఆదివాసీ సంస్కృతికి, ముఖ్యంగా కోయల వారసత్వ సంపదకు ప్రతీకగా ఈ పనులను తీర్చిదిద్దేందుకు సంకల్పించడం సాధారణ అంశం కాదు.ఈ పనురుద్ధరణ పనులపై కొందరు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్న మాట వాస్తం. ఇందులో కొందరు వ్యక్తం చేసే భిన్నాభిప్రాయాలు నిజాయతీతో కూడుకుని ఉన్నాయి. మరి కొందరు ఈ పునరుద్ధరణను వివాదాస్పదం చేస్తున్నారనే ఆరోపణలూ ఉన్నాయి. తమ తమ రాజకీయ లాభాపేక్షతో కొందరు ఈ ప్రయత్నం చేస్తే చేయవచ్చేమో! కానీ ఈ వివాదాలకు ఇవే కారణలని భావించి, వ్యక్తమవుతున్న అభిప్రాయాలను కొట్టిపారేయడం మాత్రం సముచితమైంది కాదు.ఎవరు ఏ ఉద్దేశంతో.. ఇంకా సూటిగా చెప్పాలంటే కొందరు కుట్రపూరిత ఆలోచనతో వివాదం సృష్టిస్తున్నారనుకున్నా మరి కొందరు వ్యక్తం చేస్తున్న అనుమానాల్లో కొంత వాస్తముందని భావించినా ఇంకొందరి ప్రశ్నలకు సముచితమైన సమాధానం అవసరమేనన్న అభిప్రాయం కలిగినా.. వీటన్నింటికి సరైన సమాధానం చెప్పాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం పైన్నే ఉంది.

ఈ పనిని సక్రమంగా, సరైన పద్ధతిలో.. అవసరమైన రీతిలో అమలు చేయకపోవడం వల్ల.. ప్రభుత్వం, ముఖ్యంగా సీఎం రేవంత్ రెడ్డి.. ఎంత విశాల ప్రాతిపదికన ఈ పనులకు అనుమతినిచ్చారో.. అంతే విశాలత్వంలో తాము అమలు చేస్తున్న విధానాన్ని పారదర్శకంగా ప్రజల ముందు ప్రదర్శించాల్సింది. మరీ ముఖ్యంగా.. కొనసాగుతున్న పునరుద్ధరణపై తాము నిర్దేశించుకున్న పనికి ఆధారాలను ప్రదర్శిస్తే ఇలాంటి కాంట్రవర్సీకి అవకాశం లభించేదే కాదు. ఇక్కడే సర్కారు పప్పులో కాలేసింది. ఫలితంగా అనవసర విమర్శలకు, అవసరమైన అనుమానాలకు సరైన నివృత్తి లభించలేదు. పైగా.. సమస్య పెద్దగా మారి చర్చనీయాంశమవుతోంది. దీంతో సర్కారు విశాల దృక్పథం, మంచి ఆలోచనతో చేపట్టిన మేడారం పునరుద్ధరణ పనుల నుంచి ఆశించిన స్థాయిలో ఫలితాన్ని పూర్తిగా పొందలేకపోతున్నది.

వివాదవుతున్న ప్రధాన అంశాలివే!!

తెలంగాణ ప్రభుత్వం దాదాపు రూ. 251 కోట్ల వ్యయంతో ఈసారి మేడారం జాతర నిర్వహిస్తోంది. ఇందులో దాదాపు 101 కోట్లు మేడారం గద్దెల ప్రాంగణం పునరుద్ధరణ కోసం ఖర్చు చేస్తున్నట్లు తాజాగా ప్రకటించారు. ఈ పునరుద్ధరణలో వివాదమవుతున్న లేదా ప్రశ్నిస్తున్న లేదా అనుమానం వ్యక్తం చేస్తున్న ముఖ్యాంశాలు ఒకసారి గమనిద్దాం.

మొదటిది..మేడారంలోని గద్దెల ప్రాంగణంలో శాశ్వత కట్టడాల నిర్మాణం.. అంటే రాతి ప్రాకార నిర్మాణం చేపట్టడం సరైందేనా? సహజ సిద్ధంగా ఉండే వాటిచుట్టూ కొత్తగా శాశ్వత నిర్మాణాలు చేపట్టడం సరైందేనా?

రెండోది..వనదేవతల గద్దెల చుట్టూ శాశ్వత నిర్మాణాలౌ అంటే రాతి కట్టడాలు కట్టడం సరైందేనా?

మూడోది..గతంలో ఉన్నట్లు కాకుండా గద్దెల స్థలాలు మార్చడం సరైందేనా? అంటే.. సమ్మక్క, సారలమ్మ గద్దెలను మార్చనప్పటికీ పగిడిద్దరాజు, గోవిందరాజుల గద్దెలను మార్చి.. ఒకే వరుసలో నిర్మించడం సరైందేనా?

నాలుగు..గద్దెల ప్రాంగణంలో నిర్మించిన రాతి స్తంభాలు, ప్రాకారం, పెద్ద రాతి ద్వారాలకు ఉపయోగించిన రాతి స్తంభాలపై.. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు, చరిత్రకు సంబంధించివని ప్రకటిస్తూ చెక్కిన 7వేల బొమ్మలు.. ఆదివాసీలకు సంబంధించినవేనా?

ఐదవది..ఆదివాసీ సంస్కృతిపై బ్రాహ్మణీయ ఆధిపత్యమంటూ చెక్కిన బొమ్మల్లో శివలింగం, మూడు నామాలు, శంకుపై అనుమానాలు వ్యక్తం చేయడం ఒక అంశమైతే.. దీనికి భిన్నంగా చెక్కిన స్వస్తిక్ గుర్తు.. హిందూ స్వస్తిక్ తరహాలో లేదనే అభ్యంతరం మరోటి.

ఆరు..ప్రధానంగా వనదేవతలు కొలువైన మేడారానికి ఉండే ప్రత్యేకతకు ఏమన్నా భంగం వాటిల్లుతున్నదా?

ఏడవది..పునరుద్ధరణ నిర్మాణాల తీరుకు, చేపట్టిన పనులకు, చెక్కిన బొమ్మలకు ఆధారాలేంటి? వాటి చారిత్రక నేపథ్యం ఏంటి?

సర్కారు గుర్తించినౌఅమలులో లోపం

వనదేవతలుగా కీర్తించబడుతున్న సమ్మక్క, సారలమ్మల పూర్వీకులైన.. అణగారిన కోయ తెగకు సంబంధించిన చారిత్రక, వారసత్వ, సాంస్కృతిక, సంప్రదాయ చరిత్ర.. భద్రంగా బంగారు అక్షరాల మధ్య భద్రపరిచి ఉంటే ఈ సమస్య ఉత్పన్నమయ్యేదే కాదు. వారి చరిత్ర రాసిపెట్టి, మంచి బైండింగ్ చేసిన పుస్తకంగా లభిస్తే ప్రస్తుత వివాదాలకు హేతువుగా మారేదికాదు. ఇక్కడే అసలైన సమస్య ఉంది.మంచి ప్రయత్నం చేస్తున్నపుడు అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటున్నప్పటికీ.. వాటిని ప్రదర్శించడంలో జరిగిన లోపమే ముఖ్యకారణంగా భావించాల్సి వస్తోంది. ఎందుకంటే.. మేడారం గద్దెల ప్రాంగణం పునరుద్ధరణ అంటే అనేక విశ్వాసాలు, సంప్రదాయాలు, వారసత్వానికి సంబంధించి.. కోట్లాది మంది సెంటిమెంట్లకు సంబంధించిన అంశం. ఇదే ఇక్కడ అత్యంత ప్రధానమైంది. అందుకే ఈ పనిని చేపట్టాలంటే ధైర్యమే కాదౌ పనికి పూనుకోవడం కత్తిమీద సాములాంటిదే. ఈ అంశాన్ని ప్రభుత్వం గుర్తించినప్పటికీ.. దాన్ని అమలు చేయడంలో జరిగిన విధానపరమైన లోపమే తాజా వివాదాలకు కారణంగా భావించాల్సి వస్తోంది. తాము చేపట్టిన కార్యక్రమంలో చిత్తశుద్ధిని నిరూపించుకునే పద్ధతిని అనుసరించకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా ఈ లోపాన్ని సరిదిద్దాల్సి ఉన్నది. బహిరంగంగా లేదా అవసరమైన చోట.. ఆ చారిత్రక లేదా తమ వద్ద అందుబాటులో ఉన్న ఆధారాలను ప్రదర్శిస్తే ఈ చర్చకు ముగింపు పలకడమే కాదు.. చేపట్టే పనులపట్ల విశ్వసనీయతతో పాటు చరిత్రను మరో మెట్టెక్కించే అవకాశం లభిస్తుంది. ఆగ్రహావేశాలతోనో, అనవరసమైన ఆరోపణలు, విమర్శలతోనో దాడి, ప్రతిదాడులు చేయడం వల్ల నష్టమే తప్ప ముందడుగు ఉండదనే అంశం ఇక్కడ ప్రధానమైంది.

శాశ్వత ఆలోచణ ఫలితమే 'పునరుద్ధరణ'

మేడారం జాతర గతంలోనూ, ఇప్పుడు కూడా అధికారికంగా వారం రోజుల జాతరే. ఎందుకంటే గద్దెల ప్రాంగణంలో వనదేవతలు కొలువు తీరేది ఈ వారం రోజులు మాత్రమే. కొన్నేండ్ల క్రితం వరకు ఈ వారం రోజులు మాత్రమే జాతర జరిగేది. లక్షల మంది భక్తులు తరలివచ్చేవారు. ఆ తర్వాత ఎలాంటి సందడీ ఉండేది కాదు. కానీ.. అందుబాలులోకి వచ్చిన ఆధునిక రవాణా సౌకర్యాలు, గిరిజనులతోపాటు.. గిరిజనేతరుల్లోనూ మేడారం వనదేవతలపై విశ్వాసం పెరగడంతో జాతర సమయంలోనే కాకుండా ఇతర సమయాల్లోనూ మేడారాన్ని సందర్శిస్తున్నారు. దీంతో జాతరకు నెల రోజుల ముందుగానే రద్దీ పెరుగుతోంది. గత కొన్నేండ్లుగా ఏడాది పొడవునా మేడారాన్ని సందర్శించి.. మొక్కులు సమర్పిస్తున్నవారూ కనిపిస్తున్నారు. గతంలో జాతర సమయంలోనే ఇక్కడ వసతులు కల్పించే వారు. కానీ, ఇటీవల నిత్యం భక్తుల సందర్శన పెరగడంతో మేడారంలో శాశ్వత వసతులు కల్పించాల్సిన పరిస్థితి ఏర్పడింది.కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి సీతక్క ప్రోద్భలంతో మేడారంలో మాస్టర్ ప్లాన్ అమలుకు సిద్ధమయ్యారు. రేవంత్ రెడ్డికి కూడా మేడారం సెంటిమెంట్ అన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో శాశ్వత వసతులతో పాటు భక్తులు సులువుగా సందర్శించే విధంగా గద్దెల ప్రాంగణంలో మార్పులకు శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో గతంలోని ప్రాకారం స్థానంలో శాశ్వత నిర్మాణం వైపు.. అవికాస్తా రాతికట్టడాల నిర్మాణం దిశగా మారాయి.పగిడిద్దరాజు, గోవిందరాజుల గద్దెల మార్పౌ నాలుగు గద్దెల చుట్టూరా రాతి స్థంభాల నిర్మాణరౌ పాత ఫెన్సింగ్, గోడ స్థానంలో రాతి ప్రాకారరౌ భారీ రాతి ద్వారాల నిర్మాణం.. కొత్తగా ప్రణాళికలోకి వచ్చాయి. ఎలాగూ రాతి నిర్మాణాలు చేస్తున్నారు కాబట్టి.. వాటిపై ఆదివాసీల అంటే సమ్మక్క, సారలమ్మల వారసత్వంగా ప్రాతినిధ్యం వహిస్తున్న కోయల చారిత్రిక, ఆధ్యాత్మిక, జీవన విధానాన్ని చాటిచెప్పే బొమ్మలు చెక్కేందుకు నిర్ణయించారు.ఈ ప్రణాళిక అమలు కోసం ముందస్తు కసరత్తు బాగానే చేపట్టారు. పూర్తి సెంటిమెంట్, సంప్రదాయంతో కూడుకున్న అంశం కాబట్టి అనేక సమావేశాల అనంతరం తుది ప్రణాళిక రూపొందించారు. ఈ అంశంలో ప్రభుత్వం తగిన జాగ్రత్తలు తీసుకున్నది. ముఖ్యంగా జాతర పూజారులు, కోయ పెద్దల అభిప్రాయాలు, విశ్వాసాలకే తొలి ప్రాధాన్యం ఇవ్వడంతో ప్రాజెక్టు పట్టాలెక్కింది. ఆదివాసీ బిడ్డ సీతక్క మంత్రిగా ఉండటం ఈ ప్రాజెక్టుకు కలిసొచ్చిన అంశం. ప్రస్తుతం సాగుతున్న పనుల పూర్తికి ప్రభుత్వం వంద రోజుల టార్గెట్ పెట్టుకున్నది. సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఈ నెల 19న ప్రారంభోత్సవానికీ సిద్ధమవుతున్నారు.

పారదర్శక ప్రకటన, ఆధారాలు ముఖ్యం

మేడారం పునరుద్ధరణ పనులపై సందేహాలు వ్యక్తం చేస్తున్నవారిలో నిజాయతీతో కూడుకున్నవారున్నారు. కొందరు రాజకీయ స్వార్థపరులున్నారు. ఎవరిది ఏ కారణమైనా సమాధానం చెప్పాల్సిన బాధ్యత మాత్రం తెలంగాణ సర్కారుదే. ఈ లోపం కారణంగా సమస్య తీవ్రమైంది. ఆదివాసీ పూజారులు, పెద్దల విశ్వాసాలను పరిగణలోకి తీసుకున్నామని ప్రభుత్వాధినేతలు స్పష్టం చేస్తున్నారు. నిజానికి వారి అంగీకారం ఉన్నందునే పనులు సాఫీగా సాగుతున్నాయి. కానీ, కోయల చరిత్ర, వారసత్వం, సంస్కృతి అంటూ బొమ్మలు చెక్కారు. అందులో కొన్నింటిపై సందేహాలు వ్యక్తమవుతున్న ఈ తరుణంలో.. చారిత్రక అంశాలతో ముడివడిన వీటిని సావధానంగా, వీలైతే సరైన ఆధారాలతో నివృత్తి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. కానీ, ఇక్కడే లోపం జరుగుతోంది. ఈ శాశ్వత నిర్మాణాలు చేపట్టడానికి ముందే ప్రభుత్వం .. స్పష్టమైన వివరాలతో కూడిన 'విధాన ప్రకటన' చేస్తే బాగుండేది. దానికి సబంధించిన అంశాలు, వీలైతే ఆధారాలు పొందుపరిస్తే సందేహాలకు సమాధానం చెప్పినట్లుండేది. వాటిని రికార్డు చేయడం వల్ల భవిష్యత్ తరాలకు సైతం ఉపయోగకరంగా ఉంటాయి.

కోయల చరిత్ర, లింగం, నామాలు, స్వస్తిక్ పోలిన బొమ్మలపై అనుమానాలు వ్యక్తం చేస్తే మంత్రులు , మరో పరిశోధకుడు జవాబులు చెబుతూ వచ్చారు. ప్రశ్నిస్తే సమాధానాలు చెప్పడం కాకుండా ఈ నిర్మాణాలకు ముందే ఏ అంశాల ప్రాతిపదికన, ఎవరి పరిశోధన ఫలితాల పై ఆధారపడి ఈ శాశ్వత నిర్మాణాలు, బొమ్మలు చెక్కుతున్నామనే విషయాలు తేటతెల్లం చేస్తే ఇంతగా వివాదానికి తావిచ్చే అవకాశం ఉండేది కాదు. అంతేకాదు.. కావాలని వివాదం చేయాలనుకునే వారికి కూడా చెక్ పెట్టేందుకు వీలుండేది. ఇది ఆదివాసీలకు సంబంధించిన అంశమే అయినప్పటికీ చారిత్రాత్మకమైన అంశాలున్నందున.. పారదర్శకత కూడా అంతే అవసరం.

సమాధానమే సరైన మార్గం

మేడారం జాతరలో చెక్కిన బొమ్మలు, ఇతరత్రా వాటిని ప్రశ్నించే వారిపై.. వారిది తప్పైనప్పటికీ.. ఆగ్రహం వ్యక్తం చేయడం వల్ల విషయం పలుచనవుతోంది. నిజమే! చాలా సంవత్సరాల తర్వాత ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయం, కట్టుబాట్లు, జీవనవిధానం, గొట్టు, గోత్రాలను రక్షంచేందుకు అవకాశం లభించి ఉండవచ్చు! ప్రకృతి సిద్ధాంతంపై ఆధారపడినందున ఆదివాసీలు స్వస్తిక్‌కు భిన్నమైన గుర్తును వినియోగించి ఉండవచ్చు. పంచభూతాల పై ఆధారపడిన జీవితం ఆదివాసీలది. కాదనలేము. ఆదివాసీ తలపతులు, వడ్డెల ఆలోచనలు, అనేక మంది రిసెర్చ్, కోయజాతి అస్థిత్వం, తాళపత్రాలు, ఐసోలేటెడ్ పూజావిధానం, కల్చర్, జీవనవిధానం, సమ్మక్క, సారలమ్మల అర్కియోలజీ ఇండిజీనల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ కృషి.. ఇవన్నీ వారు చెప్పినట్లుగానే వెయ్యి ఫీల్డ్ వర్కులు, వందల వేల్పు జాతరలపై పరిశోధన చేసిన ఫలితమై ఉండొచ్చు. దీని ఫలితంగా స్వల్ప కాలంలో 7వేల బొమ్మలు వేసి ఉండొచ్చు.ఇదిలా ఉండగా రాతికట్టడం పై చెక్కిన నామం తిరుమల వెంకన్న నామం కాదని, పగిడిద్దరాజు నిలువు బొట్టుగా, గొట్లల్లోని నిలువు బొట్ల ఆధారంగా రూపొందించినట్లుగా పరిశోధకులు చెబుతున్నారు.భారత దేశ చరిత్ర మొత్తమే ఆదివాసీలదని అనుకున్నప్పుడౌ దేశంలో పురాతన దేవాలయాలు, కట్టడాలు ఎవరివి? అక్కడి అర్కిటెక్చర్ ఎవరిదంటూ ఎదురు ప్రశ్నిస్తున్నారు. రాతి స్తంభాల పైన చెక్కిన శంఖమైనా.. స్వస్తిక్ అయినా శూలమైనా ముందుగా ఆదివాసీలదే అవుతోందని ప్రకటించారు. భారత దేశమే ఆదివాసీలదనే విధంగా చరిత్రను నిర్మించబోతున్నామని ప్రకటించారు. దీనిలో భాగంగానే మేడారంలో తొమ్మిది ఆర్చ్‌లు, 32 పిల్లర్లు, 64 ప్యానెళ్ళ పైన 7వేల బొమ్మలు చెక్కినట్లు వివరణలు ఇస్తున్నారు. అయినప్పటికీ.. ప్రశ్నించే వారికి, సందేహాలు వ్యక్తం చేస్తున్నవారికి ఇదొక్కటే సరైన సమాధానం కాదు. అవసరమైన ఆధారాలు ప్రదర్శించే విధంగా వ్యవహరిస్తే.. కోయచరిత్ర మరింత ద్విగుణీకృతమవుతుంది. ఎన్ని కుట్రలు చేసినా అడ్డుకుంటామని, ఆదిమ చరిత్రను, ఆదివాసీల చరిత్రను అడ్డుకునే విధంగా చేస్తే సమ్మక్కసారలమ్మల ఆగ్రహానికి గురవుతారని శాపనార్థాలు పెట్టడం వారికి ఆత్మ సంతృప్తినివ్వవచ్చేమోగానీ, మేడారం పునరుద్ధరణ ప్రణాళికలో చేపట్టిన పనులు, నిర్మాణాలు, శిల్పాలు, ఆకృతులు, బొమ్మలకు హేతువేంటిది? ఏమిటా ఆధారాలనేదే ఇక్కడ ప్రధానం. అందుకే.. ఇదిగో వారి చరిత్ర!! వారి వారసత్వానికి సాక్ష్యులివిగో!! అంటూ సగర్వంగా ప్రభుత్వం ద్వారా ప్రకటించినప్పుడు మాత్రం అది.. సరైన, తిరుగులేని సమాధానమవుతుంది.

# జనగామ జిల్లాలను రద్దు చేస్తే అగ్నిగుండమే

జనగామ, జిల్లాల పునర్వ్యవస్థీకరణ పేరుతో జనగామ జిల్లాను రద్దు చేయాలని చూస్తే జిల్లా అగ్నిగుండం అవుతుందని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి హెచ్చరించారు. జనగామలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలోని ఆరు జిల్లాలను కలిపి తిరిగి వరంగల్ జిల్లాగా ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేలు నాయుని రాజేందర్‌రెడ్డి, కడియం శ్రీహరి మాట్లాడు తున్నారని మండిపడ్డారు. పోరాడి సాధించుకున్న జనగామ జిల్లాను రద్దు చేయాలని చూస్తే ఇక్కడి ప్రజలు ఊరుకోరన్నారు. జిల్లాకు సర్వాయి పాపన్న పేరును పెడతామని కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టి, ఇప్పుడు ఏకంగా జిల్లానే లేకుండా చేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. కడియం శ్రీహరి ముందు నుంచీ జనగామ జిల్లాను వ్యతిరేకించారని గుర్తు చేశారు. జనగామ జిల్లాను మూసేయాలని చూస్తే ప్రభుత్వమే మూత పడుతుందన్నారు. జనగామ జిల్లాను వరంగల్ కమిషనరేట్ పరిధి నుంచి తొలగించి ప్రత్యేకంగా ఎస్పీని కేటాయించాలన్నారు.

# కవిత త్యాగం.. అజారుద్దీన్ మంత్రి పదవికి తప్పిన గండం



హైదరాబాద్, భారత్ మాజీ క్రికెటర్ అజారుద్దీన్‌కు మంత్రి పదవి పోయే గండం తప్పినట్లేనా? ఇక ఆయనకు ఎమ్మెల్సీ పదవి గవర్నర్ వద్ద తేలేలా లేదని కాంగ్రెస్ డిసైడ్ అయిందా? అందుకే స్థానిక ఎన్నికల్లో పోటీకి అజారుద్దీన్‌ను సెట్ చేస్తున్నారా? ఒక్క దెబ్బ కు రెండు పిట్టలు అన్నట్లుగా ఒక్క నిర్ణయం తో అటు జిల్లా ఈక్వేషన్ ,ఇటు ఎమ్మెల్సీ రెండూ సెట్ అవుతున్నాయా? అసలు అదృష్టవంతుడు అంటే అజారుద్దీన్ అని పార్టీ నేతలు ఎందుకు అనుకుంటున్నారు? .. అసలు అజార్‌కు అంతలా కలిసివచ్చిన లెక్కలేంటి?

రాష్ట్ర మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన అజారుద్దీన్

తెలంగాణ రాష్ట్ర మంత్రిగా వెటరన్ క్రికెటర్ అజారుద్దీన్ ప్రమాణ స్వీకారం చేసి రెండు నెలలు దాటింది. అజారుద్దీన్ ఏ చట్టసభలో సభ్యుడిగా లేకపోవడంతో గవర్నర్ కోటా ఎమ్మెల్సీఅబశ్రీశ్రీగా కేబినెట్ నామినేట్ చేస్తూ నిర్ణయం తీసుకుని, సదరు ఫైల్ గవర్నర్‌కు పంపింది. అయితే గతంలో బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ వేసిన కేసు సుప్రీంకోర్టులో కొనసాగుతుండడంతో అది తేలే వరకు గవర్నర్ కోటా లో అజారుద్దీన్ ఎమ్మెల్సీ అయ్యేలా లేరు.. దీంతో ఆరు నెలల తర్వాత అజారుద్దీన్ మంత్రి పదవి ఊడేలా ఉందనే చర్చ జోరుగా సాగుతోంది.

ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసిన కల్వకుంట్ల కవిత

అయితే ఇంతలోనే నిజామాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ గా ఉన్న జాగృతి అధ్యక్షురాలు కవిత రాజీనామా చేయడంఅబశ్రీశ్రీతో ఆ స్థానం ఖాళీ అయింది. లోకల్ బాడీ కోటాలో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీలతో పాటు మున్సిపల్ కౌన్సిలర్ లు, కార్పొరేటర్లకు ఓటు హక్కు ఉంటుంది. అయితే సకాలంలో ఎన్నికలు జరగని కారణంగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ, కౌన్సిలర్ల పదవీ కాలం పూర్తై ఆ స్థానాల్నీ ఖాళీగా ఉన్నాయి. దాంతో స్థానిక సంస్థలు, మున్సిపోల్స్ ఎన్నికలు జరిగిన తర్వాతే ఎమ్మెల్సీ ఎన్నిక సాధ్యం అవుతుంది..

నెలాఖరుకు మున్సిపోల్స్‌కు వెళ్లాలని భావిస్తున్న ప్రభుత్వం..

ఈనెల చివరలో మున్సిపల్ ఎన్నికలకు వెళ్లాలని ప్రభుత్వం ఇప్పటికే డిసైడ్ అయింది.. నెక్స్ నెల ఎన్నికలు కంప్లీట్ అవ్వగానే మున్సిపల్ కౌన్సిలర్లు, కార్పోరేటర్లతో కవిత ఖాళీ చేసిన నిజామాబాద్ జిల్లా స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ స్థానానికి బై పోల్ వస్తుందని హస్తం పార్టీ భావిస్తుంది. ఈ స్థానం నుంచి అజారుద్దీన్ దింపేందుకు హస్తం పెద్దలు ప్లాన్ చేస్తున్నారంట. ఖాళీ అయిన నిజామాబాద్ ఎమ్మెల్సీ స్థానానికి మరో రెండు సంవత్సరాల పదవి సమయం ఉంది.. ఆ స్థానం నుంచి అజారుద్దీన్ ను గెలిపించుకుంటే 2028 వరకు ఢోకా ఉండదని హస్తం పార్టీ భావిస్తుందట.నిజామాబాద్ జిల్లాకు క్యాబినెట్లో దక్కని చోటుమరోవైపు నిజామాబాద్ ఉమ్మడి జిల్లా నుంచి ప్రస్తుత కేబినెట్ లో ఒక్కరికి కూడా మంత్రి గా అవకాశం దక్కలేదు.. ఈ నేపథ్యంలో అజారుద్దీన్ ను నిజామాబాద్ స్థానిక సంస్థ ల ఎమ్మెల్సీ కోటాలో ఎమ్మెల్సీని చేస్తే నిజామాబాద్‌కు మంత్రి పదవి ఇచ్చినట్లు అవుతుందొ ఇంకో వైపు అజారుద్దీన్ మంత్రి పదవి కి ఢోకా ఉండదని ఎత్తుగడ వేసారట పీసీసీ పెద్దలు..దీంతో ఒకే దెబ్బ కు రెండు పిట్టలు అన్నట్లుగా అటు అజారుద్దీన్ సేఫ్, ఇతిటు జిల్లా ఈక్వేషన్ వర్కౌట్ అవుతుందంటున్నారు పార్టీ నేతలు. ఏదేమైనా అజారుద్దీన్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయినా మంత్రి అయ్యాడొ గవర్నర్ కోటా ఎమ్మెల్సీ ఆలస్యం అవుతుండడంతో ఇప్పుడు స్థానిక సంస్థ ల ఎమ్మెల్సీ గా అవకాశం వచ్చింది.. దాంతో అదృష్టం అంటే నీదే గురు అంటున్నారు అందరూ.

# 18న మేడారం తరలి వస్తున్న ప్రభుత్వం

ములుగు, మేడారంలో జరుగుతున్న సమ్మక్క-సారలమ్మ జాతర ఏర్పాట్లను రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క పరిశీలించారు. జాతర పనులు తుది దశకు చేరుకున్నాయని ఆమె వెల్లడించారు. ఆ తల్లుల దర్శనం కోసం అన్నివర్గాల ప్రజలు ఈ జాతరకు తరలివస్తారన్నారు. దాదాపు రెండు కోట్ల మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నామని సీతక్క చెప్పారు. ఈ నేపథ్యంలో అన్ని శాఖల సమన్వయంతో పని చేస్తున్నామని వివరించారు. మేడారం భక్తులకు ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోందన్నారు. సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. సీఎం రేవంత్ రెడ్డికి.. సమ్మక్క సారలమ్మ తల్లులతో ఎంతో భావోద్వేగ బంధం ఉందని గుర్తుచేశారు. అందుకే రూ.260 కోట్లతో మేడారం అభివృద్ధి పనులు చేపట్టారని చెప్పుకొచ్చారు. జనవరి 18న మేడారంలో దేవాలయాన్ని ప్రారంభించేందుకు సీఎం విచ్చేయనున్నారని తెలిపారు. ఇక్కడే కేబినెట్ సమావేశం సైతం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అంటే.. ఆ రోజు రాష్ట్ర ప్రభుత్వమే మేడారంనకు తరలి వస్తుందన్నారు. మేడారం వచ్చే భక్తులకు త్వరితగతిన అమ్మవార్ల దర్శనం జరిగేలా చర్యలు తీసుకోవాలని దేవాలయ అధికారులను ఆదేశించారు సీతక్క. కనీసం మూడు రోజుల పాటు సంప్రదాయ భక్తులు మేడారంలోనే బస చేస్తారని వివరించారు. అందుకు వారికి అవసరమైన వసతులను కల్పించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. రవాణా, తాగునీరు, శానిటేషన్ సమస్యలు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారామె. అలాగే.. ట్రాఫిక్ సమస్యలు లేకుండా చర్యలు



చేపట్టాలని పోలీసులకు స్పష్టం చేశారు మంత్రి. సామాన్య భక్తులు ఆర్టీసీ బస్సుల్లో తరలివస్తారని.. ఈ మార్గంలో నడిచే బస్సుల పర్యవేక్షణ ఉండాలని ఆర్టీసీ సంస్థ ఉన్నతాధికారులకు సూచించారు. సమ్మక్క సారలమ్మ మహా మేడారం జాతరను దృష్టిలో ఉంచుకుని ముందస్తుగానే అన్ని చర్యలు పూర్తి చేశామని మంత్రి సీతక్క వివరించారు. మేడారం జాతర అధికారిక వెబ్‌సైట్‌ను మంత్రి సీతక్క ప్రారంభించారు. అలాగే.. మేడారం వాట్సప్ చాట్ బాత్‌తోపాటు మొబైల్ యాప్‌నూ విడుదల చేశారు. వెబ్‌సైట్, మొబైల్ యాప్‌లో హెల్త్ క్యాంప్, టాయిలెట్ బాక్సులు, రూట్ మ్యాప్‌లు, ట్రాఫిక్ అప్‌డేట్‌లు, సహాయ కేంద్రాల ఫోన్ నంబర్లు, ఫిర్యాదుల నమోదుకు ప్రత్యేక వ్యవస్థ, నీటి సౌకర్యం తదితర అన్ని సౌకర్యాల సమాచారం కోసం వాట్సాప్ నంబర్ 7658912300 అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ఆమె వివరించారు.

# చార్మినార్ చుట్టూ మిలమిల!

హైదరాబాద్: హైదరాబాద్ అనగానే గుర్తుకొచ్చే పేరు.. మదిలో మెదిలే చిహ్నం.. ఇరుగు పొరుగు జిల్లాలు, రాష్ట్రాలు, విదేశాల నుంచి హైదరాబాద్‌కు వచ్చే పర్యాటకులు తప్పనిసరిగా సందర్శించే పర్యాటక ప్రాంతం..హైదరాబాద్ ఐకాన్‌గా ప్రసిద్ధి.. అదే చార్మినార్. దీని పరిసరాల్లో పర్యాటకులను ఆకట్టుకునేలా, ప్రత్యేకంగా కనిపించేలా వెలుగుజిలుగులతో స్పెషల్ లైటింగ్ ఏర్పాట్లు చేయాలని అధికారులు నిర్ణయించారు.చార్మినార్ నాలుగువైపులా ఉన్న వీధిదీపాల స్థానే ఆకర్షణీయంగా కనిపించే విద్యుత్ స్తంభాలు, ప్రకాశవంతమైన స్పెషల్ ఎల్ఈడీ లైటింగ్ ఏర్పాట్లు చేయనున్నారు.చార్మినార్ చుట్టూ, పరిసరాల్లోని పత్తర్‌ఘట్టి, చార్‌కమాన్ ప్రాంతాల్లోనూ వీటిని ఏర్పాటు చేసేందుకు పాతబస్తీలో వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్న కులీ కుతుబ్‌షా అర్బన్ డెవలప్‌మెంట్ అథరిటీ(కుడా) అధికారులు ఆర్ఎఫ్‌పీ టెండర్లు ఆహ్వానించారు. టెండర్ల దాఖలుకు ఈ నెల 27వ తేదీ వరకు గడువుంది. పాతబస్తీలో వివిధ పనులు చేసేందుకు వెనుకాడుతున్న కాంట్రాక్టు ఏజెన్సీలు ఈ పనులు చేసేందుకు ఏమేర ముందుకొస్తాయో వేచి చూడాల్సిందే. చార్మినార్ పరిసరాల్లోనే ఆయా ప్రాంతాల



ప్రత్యేకతలు తెలిసేలా క్యూఆర్ కోడ్‌లతో కూడిన డిజిటల్ సైన్‌బోర్డులు ఏర్పాటు చేసేందుకు కూడా టెండర్లు పిలిచి నెలలు గడుస్తున్నా ఇంతవరకు పనులు మొదలుకాలేదు.

# గాంధీపేరుతో కాంగ్రెస్ నీచ రాజకీయం



కరీంనగర్,ఉపాధి హామీ పథకం పేరు మార్చడంపై కాంగ్రెస్ చేస్తున్న రాజకీయాన్ని నీచ రాజకీయంగా కేంద్రమంత్రి బండి సంజయ్ అభివర్ణించారు. వాల్మీకీ-అంబేద్కర్ ఆవాస్ యోజన (వాంబే) పేరుతో వాజ్‌పేయి తీసుకొచ్చిన ఇండ్ల పథకాన్ని కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఎందుకు తీసేశారని ప్రశ్నించారు. వాల్మీకీ, అంబేద్కర్ పేర్లు తొలగించి ఇందిరా ఆవాస్ యోజనగా ఎందుకు మార్చారని, ఇది ఆ మహానుభావులను అవమానించడం కాదా అని విమర్శించారు. అలాగే గతంలో ఎన్టీఆర్ టెర్మినల్‌గా ఉన్న హైదరాబాద్ విమానాశ్రయ టెర్మినల్ పేరును తీసేసి రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుగా ఎందుకు మార్చారని బండి సంజయ్ ప్రశ్నించారు. కాంగ్రెస్ నేతలపై తీవ్ర విమర్శలు గుప్పించిన ఆయన.. గాంధీ పేరును వాడుకున్నారే తప్ప మహాత్మా గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని కాంగ్రెస్ నేతలు పాతరేసి ఆయన ఆత్మను క్షోభకు గురిచేశారని ఆరోపించారు. వారసత్వ రాజకీయాలను గాంధీ వ్యతిరేకించారని గుర్తుచేశారు. అలాగే ఆయన పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ వ్యాఖ్యలపై స్పందించారు. రాముడి బాటలో నడుస్తామని, రాముడి ఆలయాలను నిర్మిస్తామని తాము చెప్పినప్పుడు కాంగ్రెస్‌కు నొప్పి ఎందుకు వస్తోందని ప్రశ్నించారు. దేశంలో అనేక పథకాలు కేంద్ర,రాష్ట్ర భాగస్వామ్యంతోనే నడుస్తున్నాయని, ఈ పథకానికి రాష్ట్ర భాగస్వామ్యం కల్పిస్తే తప్పేముందని నిలదీశారు. ఉపాధి కూలీల వేతనాలను కూడా సకాలంలో ఇవ్వలేని కాంగ్రెస్ నేతలు మాట్లాడటం విడ్డూరమని విమర్శించారు.కరీంనగర్ ప్రజలకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త అందించిందని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. కరీంనగర్‌లో జరిగిన కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ.. అర్బన్ ఇన్‌ఫ్రాస్టక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌కు మొత్తం రూ.50 కోట్లు విడుదల చేసినట్లు ఆయన వెల్లడించారు. ఇందులో కేంద్ర వాటా రూ.40 కోట్లు ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ నిధులతో కరీంనగర్ రూపురేఖలు పూర్తిగా మారబోతున్నాయని అన్నారు. స్మార్ట్ సిటీ, స్వచ్ఛ భారత్, అమృత్ తదితర వివిధ కేంద్ర పథకాల ద్వారానే కరీంనగర్ అభివృద్ధి జరుగుతోందని బండి సంజయ్ స్పష్టం చేశారు. ఈ విషయాన్ని కరీంనగర్ ప్రజలు గమనిస్తున్నారని అందుకే ఈసారి కార్పొరేషన్‌పై కాషాయ జెండా ఎగరేయడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. అన్ని పార్టీల నేతలు బీజేపీలోకి రావడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. టిక్కెట్ల కేటాయింపులో కాషాయ కార్యకర్తలకే మొదటి ప్రాధాన్యత ఉంటుందని స్పష్టం చేశారు ఆయన. అవినీతి ఆరోపణలు లేదా రౌడీషీట్లు ఉన్నవారిని పార్టీలోకి తీసుకోమని తేల్చిచెప్పారు. గతంలో కేసీఆర్ తన ఇష్టానుసారంగా కొడుకు, కూతురు, అల్లుడి కోసం కుటుంబ ఆస్తులు పంచినట్లే జిల్లాల ఏర్పాటు చేశారని ఆరోపించారు. అదే తరహాలో కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తే ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. తక్షణమే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి, ప్రజాభిప్రాయ సేకరణ జరపాలని డిమాండ్ చేశారు. ప్రజలకు మంచి జరుగుతుంటే కాంగ్రెస్‌కు ఎందుకు అక్కసు అని ప్రశ్నించిన బండి సంజయ్, గ్రామాల్లో ఆస్తులు నిర్మించడం తప్పా..? రైతులకు మేలు చేసే పథకం కాదా..? తెలంగాణకు అదనంగా రూ.340 కోట్లు వస్తుంటే వద్దంటారా..? అంటూ నిలదీశారు. వీబీజీ రామ్ జీ పథకం కావాలా..? వద్దా..? కాంగ్రెస్ స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు. 'వీబీ జీరామ్ జీ' పథకంతో ఉపాధి కూలీల ఆదాయం రెట్టింపు అవుతుందని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. 'ఈ పథకం ద్వారా ఏడాదికి 200 రోజుల ఉపాధి దొరుకుతుంది. పనుల విషయంలో కేంద్రం జోక్యం ఉండదు. ఈ పథకం కోసం గతంలో కంటే అదనంగా రూ.17 వేల కోట్లు వెచ్చిస్తున్నాం. తెలంగాణలో ఈ పథకం అమలుకు అదనంగా రూ.340 కోట్లు ఇవ్వబోతున్నాం. రైతులకు న్యాయం చేసేలా దీన్ని తీసుకొచ్చాం. వ్యవసాయ సీజన్‌లో ఈ పథకం పనులు జరగవు. దీంతో కూలీలు అందుబాటులో ఉంటారని తెలిపారు.

# ఇరాన్ ఆందోళనల్లో భారీగా మరణాలు



న్యూఢిల్లీ, ఇరాన్‌లో అక్కడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా కొనసాగుతున్న ఆందోళనల్లో భారీ సంఖ్యలో మరణాలు చోటుచేసుకున్నట్లు ఆందోళన కలుగుతోంది. ఇప్పటివరకు ఆరు వందల మందికి పైగా చనిపోయినట్లు అధికారిక సమాచారం రాగా.. ఈ సంఖ్య రెండు వేల వరకు ఉండొచ్చని ఇరాన్ అధికారులు సంకేతాలిచ్చారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న ఆందోళనల్లో పౌరులతో పాటు భద్రతా సిబ్బంది ప్రాణాలు కోల్పోయినట్లు ఓ అంతర్జాతీయ మీడియా సంస్థతో ఇరాన్ అధికారులు వెల్లడించారు. అక్కడ పెరుగుతోన్న హింస చాలా భయపెడుతోందని ఐరాస మానవ హక్కుల సంఘం కూడా ఆందోళన వ్యక్తం చేసింది. ఇదే సమయంలో ఇరాన్‌కు చెందిన వెబ్‌సైట్ మాత్రం ఇటీవల ఆందోళనల్లో పది వేల మందికిపైగా ప్రాణాలు కోల్పోయినట్లు సంచలన కథనంలో పేర్కొంది. ఈ మరణాల వెనక ఉగ్రవాదులు ఉన్నారని ఆరోపించారు. మరోవైపు ఇటీవల ఘర్షణల్లో 12 వేల మంది చనిపోయినట్లు 'ఇరాన్ ఇంటర్నేషనల్' కథనం పేర్కొంది. భద్రతా సంస్థలు, అధ్యక్ష కార్యాలయం, ప్రత్యక్ష సాక్షులు, వైద్యాధికారులు.. తదితర వర్గాల నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా ఈ అంచనా వేసినట్లు తెలిపింది. జనవరి 8, 9 తేదీల్లోనే ఈ మరణాలు చోటుచేసుకున్నాయని, ఓ ప్రణాళిక ప్రకారమే ఈ హింసాత్మక ఘటనలు జరిగాయని వెల్లడించింది. ఆధునిక ఇరాన్ చరిత్రలో ఈ తరహా హింస ఎన్నడూ చోటుచేసుకోలేదని పేర్కొంది. దేశవ్యాప్తంగా 31 ప్రావిన్సుల్లో 600లకుపైగా ప్రదేశాల్లో నిరసనలు కొనసాగినట్లు అమెరికా కేంద్రంగా నడిచే మానవ హక్కుల కార్యకర్తల వార్తా సంస్థ పేర్కొంది. వందలాది మంది మృతి చెందగా, 10వేలకు పైగా నిరసనకారులను అక్కడి పోలీసులు అరెస్టు చేసినట్లు తెలిపింది. అయితే, ఈ భయంకరమైన హింసాత్మక ఘటనలు ఇలాగే కొనసాగితే చాలా కష్టమని.. ఇరాన్ పౌరుల న్యాయమైన డిమాండ్లను తప్పక వినాల్సిందేనని ఐరాస మానవ హక్కుల హైకమిషన్ పేర్కొంది. మరణాలు వందల సంఖ్యలో ఉన్నట్లు వార్తలు వస్తున్నాయని ఆ సంస్థ అధికార ప్రతినిధి జెరెమీ లారెన్స్ పేర్కొన్నారు. అంతేకాదు.. అరెస్టైన వారిలో అనేక మందికి మరణశిక్ష పడవచ్చనే ఆందోళన వ్యక్తం చేశారు.

### ఎమ్మెల్యే ప్రసాద్ గన్‌మెన్ షేక్ షావలిపై సస్పెన్షన్ వేటు

అనంతపురం,అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ గన్‌మెన్ షేక్ షావలిని సస్పెండ్ చేస్తూ జిల్లా ఎస్పీ జగదీష్ ఆదేశాలు జారీ చేశారు. ఎగ్జిబిషన్ నిర్వాహకుడు ఫక్రుద్దీన్‌పై.. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అనుచరులు దాడి చేసిన ఘటనలో షేక్ షావలి కూడా ఉన్నట్లు ఎస్పీకి ఫిర్యాదు అందింది. ఫిర్యాదుతో పాటు ఎమ్మెల్యే అనుచరులు దాడులు చేస్తున్న వీడియోలను బాధితుడు పోలీసులకు అందజేశారు. దీంతో ఎమ్మెల్యే గన్‌మెన్‌తో పాటు మరికొందరిపై నాలుగో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

# ఆర్ఎస్ఎస్ తో చైనా కమ్యూనిస్టుల అరుదైన భేటీ

న్యూఢిల్లీ,ఇది నిజంగా విచిత్రమే. కానీ అలాంటివి జరగడం కూడా సహజమే. కమ్యూనిస్టు పార్టీకి ఆర్ఎస్ఎస్ కి సిద్ధాంత భేదాలు ఏ స్థాయిలో ఉంటాయో అందరికీ తెలుసు. దేశంలో వామపక్షలు ఆర్ఎస్ఎస్ ఆవిర్భావం ఒకేసారి 1925లో జరిగాయి. వందేళ్ళ ప్రస్థానంలో ఉత్తర దక్షణ ముఖంగానే ఈ రెండూ సాగాయి. సిద్ధాంతాలే అన్నింటి కంటే ముఖ్యం అనుకునే తీరుతోనే ప్రయాణం సాగించాయి. అలాంటిది కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ చైనా ప్రతినిధుల బృందం భారత దేశం వచ్చి మరీ ఆర్ఎస్ఎస్ ని కలవడం అంటే ఆలోచించాల్సిందే అని అంటున్నారు.

భేటీలో మ్యాటర్ :

ఇక దేశ రాజధాని న్యూఢిల్లీలోని ప్రేరణ బ్లాక్‌లోని ఆర్ఎస్ఎస్ సభ్యులతో చైనాకు చెందిన కమ్యూనిస్టు పార్టీ ప్రతినిధులు సమావేశం అయి అనేక విషయాలను చర్చించినట్లుగా చెబుతున్నారు. అయితే ఇది పూర్తిగా మర్యాదపూర్వక భేటీ మాత్రమే అని చైనా బృందం పేర్కొంది. మరో వైపు చూస్తే ఆర్ఎస్ఎస్ చీఫ్ అయిన మోహన్ భాగవత్ పర్యటనలో ఉన్నందున ఈ భేటీకి హాజరు కాలేదని ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు చెప్పుకొచ్చారు.

వారి విజ్ఞప్తి మేరకే :

కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ చైనా ప్రతినిధుల వినతి మేరకే ఈ భేటీ జరిగింది అని ఆర్ఎస్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. ఇక ఈ భేటీలో చైనా ప్రతినిధి బృందం ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హొసబలేను కలిసి అనేక అంశాల మీద చర్చించింది. ఇక ఈ భేటీ పూర్తిగా మర్యాదపూర్వకమైనదే అని ఆర్ఎస్ఎస్ కూడా చెప్పడం విశేషం. అయితే ఈ భేటీ ఏకంగా గంటసేపు సాగినట్లుగా ఆర్ఎస్ఎస్ వర్గాలు చెప్పడం గమనార్హం. అయితే ఈ భేటీకి ఒక అజెండా అంటొ లేదని ఆర్ఎస్ఎస్ వర్గాలు అంటున్నాయి. ఆర్ఎస్ఎస్ ఏర్పడి వందేళ్ళ పూర్తి అయినందువల్ల గత ఏడాది ఆగస్టులో ఆర్ ఎస్ ఎస్ వివిధ దేశాలకు చెందిన ప్రతినిధులను ఆహ్వానించింది. చిత్రమేంటి అంటే అందులో పాకిస్థాన్, టర్కీ చైనా దే-శాల ప్రతినిధులు లేరు. అంటే ఆర్ఎస్ఎస్ స్ కి చైనా ప్రతినిధులతో భేటీ కావడం ఇష్టం లేదా అన్నది మరో చర్చ. అయితే ఈ భేటీ మాత్రం జరిగిపోయింది. మరో విశేషం ఏమిటి అంటే కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ చైనా ప్రతినిధులు బీజేపీ నేతలను కూడా కలుసుకుని చర్చించారు. అయితే బీజేపీ అధికారంలో ఉన్నందున ఆ భేటీ వేరు, ప్రత్యేకించి ఆర్ఎస్ఎస్ తో భేటీ అంటే ఆలోచించాల్సిందే అని అంటున్నారు.



కాంగ్రెస్ అభ్యంతరం :

అయితే బీజేపీ కానీ ఆర్ఎస్ఎస్ కానీ చైనా ప్రతినిధులతో భేటీ కావడం మీద కాంగ్రెస్ తప్పు పట్టింది. అంతే కాదు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఒక వైపు చూస్తే షక్సాగామ్ లోయ విషయంలో చైనా, భారత్ మధ్య మాటల యుద్ధం సాగుతోంది అని గుర్తు చేసింది. ఈ నేపథ్యంలో జాతీయ పరమైన భద్రతాపరమైన అంశాలు ముందు ఉంచుకుని చైనా ప్రతినిధులతో ఈ తరహా చర్చలు ఏమిటి అని ప్రశ్నిస్తోంది. మొత్తానికి ఆర్ఎస్ఎస్ తో భారత దేశ కమ్యూనిస్టులే ఎపుడూ భేటీ కారు, కానీ చైనా కమ్యూనిస్టులు వచ్చి గంట పాటు చర్చించారు అంటే మ్యాటర్ ఆలోచించాల్సిందే అని అంటున్నారు.

### కడియంలో మొక్కలతో సంక్రాంతి శోభ

కడియం,తూర్పు గోదావరి జిల్లా కడియం మండలం కడియంలోని పల్ల వెంకన్న నర్సరీలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ప్రత్యేక మొక్కల ఆకృతి సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. సంక్రాంతి శోభను ప్రతిబింబించేలా భోగి, సంక్రాంతి, కనుమ పర్వదినాల ప్రత్యేకతను మొక్కల ద్వారానే రూపుదిద్దారు. ఆకృతిలో భోగి మంటలో పొంగుతున్న పాల కుండ, పతంగి, ఎద్దు, కోడిపుంజు వంటి పండుగకు ప్రతీకలైన అంశాలను సృజనాత్మకంగా మొక్కలతో తీర్చిదిద్దారు. అలానే చివరలో 'హ్యాపీ పొంగల్' అంటూ శుభాకాంక్షలు చెప్పడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ వినూత్న రూపకల్పనను పల్ల వెంకన్న నర్సరీ అధినేత పల్ల సత్యనారాయణ మూర్తి (సత్తిబాబు) కుమారులు, యువ రైతులు పల్ల వెంకటేష్, పల్ల వినయ్ కుమార్ రూపొందించారు. సంప్రదాయ పండుగ సంస్కృతిని పర్యావరణహితంగా ప్రజలకు చేరువ చేయాలన్న ఉ

# పది నిముషాల ఛాలెంజ్‌కు చెక్...

న్యూఢిల్లీ,టెన్ మినట్స్ ఛాలెంజ్‌పై కేంద్రం తీవ్రంగా స్పందించింది. దీనిని తొలగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఇటీవల బ్లింకిట్, జెఎటో ఇతర క్విక్ కామర్స్, ఫుడ్ డెలివరీ సంస్థలు కేవలం పది నిమిషాల్లో డెలివరీ సదుపాయాన్ని అందిస్తున్నామని ప్రకటనలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నిర్ణయంపై గిగ్ వర్కర్స్(డెలివరీ ఏజెంట్స్) తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాహనాల రిపేర్, ట్రాఫిక్ వల్ల తమకు ఇబ్బందులు కలుగుతున్నాయని వాపోతున్నారు. ఈ అంశంపై కేంద్రం ప్రభుత్వం తాజాగా కీలక ఆదేశాలు జారీ చేసింది. క్విక్ కామర్స్ ప్లాట్ ఫామ్‌లైన బ్లింకిట్, జెప్టో, స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ సంస్థలకు '10 నిమిషాల డెలివరీ' విధానం తొలగించాలని కేంద్ర ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది.కేంద్ర కార్మిక మంత్రి మన్సుఖ్ మాండవీయ.. బ్లింకిట్, జెప్టో, స్విగ్గీ సహా ఇతర క్విక్ కామర్స్ ప్రతినిధులతో సమావేశమై డెలివరీ భాగస్వాముల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని చర్చించారు. కేంద్రం ఆదేశాల మేరకు బ్లింకిట్ వంటి ఈ-కామర్స్ ఫాట్ ఫామ్‌లు 10 నిమిషాల డెలవిరీ క్లెయిమ్‌లను తొలగించినట్లు సమాచారం. ఇతర కంపెనీలు తమ బ్రాండ్ ప్రకటనలు, సోషల్ మీడియా ఎలాట్ ఫామ్‌ల



నుంచి ఈ డెలివరీ ప్రకటన తొలగిస్తామని ప్రభుత్వానికి హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. డెలివరీ ఏజెంట్లు ఇటీవల చేస్తున్న ఆందోళన దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకోవడం గిగ్ వర్కర్లకు ఊరట కలుగినట్టు పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com